అడుగుకో గుంత..



ఇది ఓబుళదేవచెరువు మండలం మమ్మదాబాద్ క్రాస్ నుంచి తనకల్లు మండలం కొక్కంటి క్రాస్ మధ్య రోడ్డు. 37 కిలోమీటర్లు దూరం ఉంది. భారీ వాహనాల రాకపోకలతో రహదారి గుంతలమయంగా మారింది. జౌకల దిన్నె నుంచి గోపాల్‌నాయక్ తండా మధ్య అడుగుకో గుంత ఏర్పడింది. గతంలో గుంతల మరమ్మతులు చేపట్టారు. భారీ వాహనాల రాకపోకలతో గుంతలు ఏర్పాడ్డాయి. ఈ రహదారిలో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగి చాలామంది ప్రాణాలు కోల్పోయారు.

ఈ ఫొటోలో కనిపిస్తున్నది రోడ్డే అంటే నమ్మడం కష్టమే కానీ, నమ్మాల్సిందే. ఏదో మారుమూల కొండల్లో దారి అనుకుంటే తప్పులే కాలేసినట్లే. గోరంట్ల మండలం ఎగువగంగంపల్లి నుంచి దిగువగంగంపల్లికి వెళ్లే రోడ్డు ఇది. ప్రయాణానికి ఏమాత్రం వీలులేకుండా ఉంది. ఈ రోడ్డులో వాహనాలు నడపడమంటే సాహసమే. చెరువు మరవ వద్ద రెండు కిలోమీటర్ల రోడ్డుకు రెండేళ్ల కిందట కంకర వేసి వదిలేశారు. అదికాస్తా కొట్టుకుపోయి కనీసం నడవడానికి కూడా వీలులేని పరిస్థితిలో ఉంది.

ఆదమరిస్తే అంతే..





పరిగి నుంచి ధనాపురం, చిన్నపల్లి రోడ్డులో అడుగుకో గుంత ఏర్పడింది. గతుకుల రోడ్డులోనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని, ప్రయాణించాల్సి వస్తోంది.



కొత్తచెరువు-గుట్టూరు రహదారిపై మరకుంటపల్లిలో గుంతలు



ఇది నల్లమాడ మండలంలోని మలకవేముల-ఓబుళదేవరచెరువు ప్రధాన రహదారి నుంచి శీకివారిపల్లి వెళ్లే రోడ్డు. రెండు కిలోమీటర్ల దూరం ఉంది. రోడ్డు పాడవునా ఛిద్రమైపోయింది. ద్విచక్రవాహనంలో ప్రయాణించాలన్నా.. కనీసం నడుచుకుంటూ వెళ్లాలన్నా కష్టమే. నిత్యం ప్రమాదాలతో సావాసం చేస్తున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు, పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడుతున్నారు.

ఛిద్రదారులు..!

రోడ్లన్నీ గోతులమయం.. అడుగుకో గుంత!

ఆంధ్రజ్యోతి
పుట్టపర్తి

ఇది కొత్తచెరువు నుంచి గుట్టూరు వెళ్లే రహదారి. ఈ రోడ్డు మరకుంటపల్లిలో భారీ గోతులు ఏర్పడ్డాయి. మోకాలి లోతుకుపైగానే ఉన్నాయి. వాటిలో డ్రైనేజీ నీరు చేరింది. వాహనదారులకు అది ఎంత లోతు ఉందో కూడా అర్థంకాని దుస్థితి నెలకొంది. వాటి లోతును అంచనా వేయలేక చాలా వాహనాలు బోల్తాపడ్డాయి. ద్విచక్రవాహనాలు, ఆటోల పరిస్థితి చెప్పనక్కర్లేదు. వాటిలోకి దిగితే గల్లంతే.



ఊళ్లలంటేనే రోడ్ల భయం. అడుగుకో గుంత, భారీ గోతులతో రహదారులు ఛిద్రమయ్యాయి. నరకప్రాయంగా మారాయి. ఏ గోతిలో ఎక్కడ వాహనం అదుపు తప్పుతుందోనన్న భయం వెంటాడుతుంది. గుండెలను చేతిలో పట్టుకుని, ప్రయాణించాల్సి వస్తోంది. గమ్యం చేరే దాకా నమ్మకం లేని పరిస్థితి ఏర్పడింది. గోతుల రోడ్లలో నిత్యం ప్రమాదాలే. ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. అంతకుమించి గాయాలపాలవుతున్నారు. అయినవారిని పోగొట్టుకున్నవారు కన్నీటిపర్యంతమవుతుంటే.. ఆస్పత్రిపాలైన వారు చికిత్సలకు అప్పులు అవుతున్నా..కం టున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలన ఆద్యంతం రోడ్లలో ఏమార్పులేదు. కనీస మరమ్మతులూ కరువయ్యాయి. కొత్త రోడ్ల నిర్మాణాలు ఆటకెక్కాయి. టీడీపీ హయాంలో చేపట్టినవి కూడా ఆగిపోయాయి. అటకెక్కాయి.

రోడెక్కాలంటే భయం

వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రధాన, గ్రామీణ రోడ్ల నిర్వహణకు నిధులిచ్చిన పాపాన పోలేదు. పూర్తిగా గాలి కొదిలేసింది. దీంతో రహదారులు అత్యంత అధ్వానంగా మారాయి. ఐదేళ్ల రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర, గ్రామీణ రహదారుల అభివృద్ధికి నామమాత్రంగా నిధులు విదిలించింది. బిల్లులు అందక పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో రహదారుల అభివృద్ధి కుంటుపడింది. జిల్లాలో పంచాయతీరాజ్, రోడ్లు, భవనాల శాఖ కింద రోడ్ల మరమ్మతులు, నిర్మాణ పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచినా.. కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. వచ్చినా పనులు మొదలు పెట్టి, బిల్లులు రాక వదిలేసిన రోడ్లే కనిపిస్తాయి. జిల్లాలో 2020 నుంచి 2022 దాకా వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న పలు రోడ్ల మరమ్మతులు తూతూమంత్రంగానే ముగించారు. చాలాచోట్ల కల్వర్టులు, కంకర వేసి వదిలేసిన రోడ్లే కనిపిస్తాయి. ఇంకెన్నాళ్లు ఈ రోడ్లపై నరక ప్రయాణం అంటూ జిల్లా ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


ప్రయాణం అంటేనే వణుకుతున్న జనం
నిత్యం ప్రమాదాలే..
గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
లెక్కలేనంత మంది ఆస్పత్రిపాలు
మరమ్మతులు మరచిన పాలకులు
అటకెక్కిన రోడ్ల నిర్మాణం



జిల్లా కేంద్రం పుట్టపర్తిలో బైపాస్‌రోడ్డు నుంచి ప్రశాంతి నిలయం పరమట ద్వారం ద్వారా పుట్టపర్తికి వెళ్లే రహదారిలో అడుగుకో గుంత ఏర్పడింది. ఐదేళ్లుగా కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదు. జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడంతో జనాల రాకపోకలు పెరిగాయి. సత్యసాయి భక్తులు దేశవిదేశాల నుంచి వస్తుంటారు. ఈ రోడ్డు దుస్థితిని చూసి వారు విసుగెత్తిపోతున్నారు.



కదిరి-రాయచోటి ప్రధాన రహదారి విస్తరణ పనులు మూడేళ్ల కిందటే మొదలు పెట్టారు. అక్కడక్కడ కల్వర్టుల నిర్మాణం చేపట్టి కమతంపల్లి నుంచి కటారుపల్లి, దోర్నాల మధ్య కంకరవేసి వదిలిపెట్టారు. ఎక్కడ చూసినా గుంతలమయంగా మారింది. వర్షాకాలంలో ఈ రహదారిలో గుంతలను గుర్తించలేక ఎన్నో ప్రమాదాలు జరిగాయి. నంబులపూలకుంట నుంచి గాలివీడు వెళ్లే రహదారిలో సోలార్ ప్రాజెక్టు వద్ద పెద్ద గుంతలు పడ్డాయి. వీటిని మట్టితో కప్పేశారు. ఈ రహదారిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. కదిరి-నంబులపూలకుంట మధ్య 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి రెండు గంటలు పడుతోందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



పరిగి-చిన్నపల్లి రహదారి ఇలా..



వంగంపల్లి నుంచి తలమర్లకు వెళ్లే రహదారిలో కంకవేసి వదిలేశారు..



చౌటుకుంటపల్లి నుంచి దొన్నికోటకు వెళ్లే రహదారి...

ఎన్నికల విధుల్లో నిబద్ధత అవసరం

పరిశీలకుడు అమిత్‌కుమార్

పుట్టపర్తి, ఏప్రిల్ 28: ఎన్నికల విధుల్లో పాలు పంచుకునే యంత్రాంగానికి నిబద్ధత ఎంతో అవసరమని హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు అమిత్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆదివారం జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. పరిశీలకుడు అమిత్‌కుమార్ మాట్లాడుతూ.. ఓటర్లను ప్రభావితం చేసే కార్యక్రమాలపై నిఘా పెట్టాలన్నారు. హింసాత్మక ఘటనలకు తావివ్వద్దన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు దీపక్ రామ చంద్ర తివారీ, అన్బుకుమార్, పోలీసు అబ్జర్వర్ ఇమ్మాలెన్సా, జేసీ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ భరత్, డీఆర్వో కొండయ్య, ఆర్‌ఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, వెంకటశివారెడ్డి, గౌరీశంకర్, ఎల్డీఎం రమణకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎన్నికల పరిశీలకులు

రాజీనామా పత్రాన్ని చూపుతున్న విజయభాస్కర్ రెడ్డి



పార్టీకి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లోచర్ల విజయభాస్కర్ రెడ్డి రాజీనామా

ఎమ్మెల్యే దుద్దుకుంటపై విమర్శలు

వైసీపీకి షాక్


పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 28: వైసీపీకి షాక్. ఆ పార్టీకి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లోచర్ల విజయభాస్కర్ రెడ్డి రాజీనామా చేశారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆయన ఆదివారం మాట్లాడారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఎమ్మెల్యే తన వ్యాపారాలు, కుటుంబ ఆస్తులు పెంచుకోవడమే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో గెలిచినా తన బ్యాంకు అప్పులను చెల్లించడమే ధ్యేయంగా పనిచేస్తారన్నారు. జాతీయ రహదారులు తానే ఏర్పాటు చేశానని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అది కేంద్ర ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. జిల్లాకేంద్రాన్ని తానే తెచ్చినట్లు ఎమ్మెల్యే ప్రచారం చేసుకోవడం చోద్యమన్నారు. జిల్లా కేంద్రం ఏర్పాటులో సత్యసాయి ట్రస్టు మునుపటి సభ్యుడు ఆర్వీ జానకీరామయ్య కృషి ఎంతో ఉందన్నారు. 193 చెరువులకు నీరందించే పనులు ప్రారంభమయ్యాయని డ్రామాలాడుతున్నారనీ, అవి ఎక్కడో చెప్పాలని ప్రశ్నించారు. తన తండ్రి లోచర్ల పెద్దారెడ్డి విగ్రహం మాయం వ్యవహారంలో ఎమ్మెల్యే పాత్ర ఉందని ఆరోపించారు. తాను ఏ పార్టీలోనూ చేరడంలేదని ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధి అంటేనే ఏంటో

- నేతన్నలపై దాడులు చేస్తే ఉపేక్షించేది లేదు
- ఉమ్మడి ధర్మవరం అభ్యర్థి సత్యకుమార్ యాదవ్
- మద్దతుగా తరలివచ్చిన తెలుగు ప్రొఫెషనల్ వింగ్
- ధర్మవరంలో భారీ ర్యాలీ

చేసి చూపిస్తా..

చేనేత వ్యవస్థలో రాజకీయ ప్రమేయాన్ని నిర్మూలిస్తా



ధర్మవరం, ఏప్రిల్ 28: సీఎం జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చేతగానితనం మూలంగా చేనేత వ్యవస్థ నిర్వీర్యమైందనీ, తాను గెలిచాక అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని ఎన్డీఏ ధర్మవరం ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ ఉద్ఘాటించారు. అప్పు కింద పట్టు చీరలను సరఫరా చేసిన పాపానికి చేనేతలను వైసీపీ పాలకులు గుడ్డలు విప్పి కొట్టిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. తమ హయాంలో ఇలాంటివి జరిగితే అవతలివారు ఏ పార్టీవారైనా ఉపేక్షించమని స్పష్టం చేశారు. చేనేత వ్యవస్థలో రాజకీయ ప్రమేయాన్ని నిర్మూలించే బాధ్యత తీసుకుంటానని ఆయన నొక్కి వక్కాణించారు. బెంగళూరు తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖాముఖిలో ఆయన ఈ విషయాలను వెల్లడించారు. ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా బెంగళూరు తెలుగు ప్రొఫెషనల్ వింగ్ కదిలింది. పెద్దఎత్తున ఆదివారం ధర్మవరం చేరుకుని టీడీపీ, బీజేపీ అభ్యర్థుల విజయం కోసం ర్యాలీ నిర్వహించింది. కాలేజ్ సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కళాజ్యోతి, ఎన్టీఆర్, అంజుమన్ సర్కిల్‌మీదుగా తేరుబజారు, కేపీ స్ట్రీట్, దిమ్మలసెంటర్ మీదుగా కదిరి గేటు వరకు సాగింది. ర్యాలీలో అన్నివర్గాల ప్రజలు.. సత్యకుమార్‌కుమద్దతు పలికారు. అనంతరం సీఎస్‌బీ కల్యాణమండపంలో బెంగళూరుకు చెందిన తెలుగు ప్రొఫెషనల్ వింగ్ సభ్యులు ధర్మవరం ఉమ్మడి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్, హిందూపురం పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథితో ముఖాముఖి నిర్వహించారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే ధర్మవరం, పెనుకొండతోపాటు జిల్లాలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ సాగింది. ఆ వివరాలివీ..



బెంగళూరు తెలుగు ప్రొఫెషనల్ వింగ్ సభ్యులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న సత్యకుమార్ యాదవ్

పాండు, తెలుగు ప్రొఫెషనల్ వింగ్..
బీజేపీలో మీరు (సత్యకుమార్) ఉన్నత స్థాయిలో ఉన్నారు. ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిస్తే మీ పలుకుబడి ఉపయోగించి ధర్మవరం, పుట్టపర్తి, పెనుకొండ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా ఏర్పాటుచేస్తే అభివృద్ధి చెందుతుందన్న భావన ఇక్కడి ప్రజల్లో ఉంది. ఆ దిశగా మీ వంతు కృషి చేయగలరా?

సత్యకుమార్ యాదవ్: ఎక్కడైనా దేశం బాగుపడితే రాష్ట్రం అదేబాటలో నడుస్తుంది. రాష్ట్రం బాగుపడితే స్థానిక ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుంది. వెంకయ్యనాయుడు ఎన్డీఏ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి, సమాచార, హౌసింగ్ తదితర శాఖలతోపాటు ఉపరాష్ట్రపతి పదవి చేపట్టారు. ఆయన వద్ద సహాయకుడిగా పనిచేయడం ద్వారా అభివృద్ధిపై అవగాహన ఏర్పడింది. ఓ గ్రామానికి రోడ్డు వేస్తే తద్వారా అక్కడికి అన్ని సదుపాయాలు కల్పించే అవకాశం ఏర్పడుతుంది. ఎన్డీఏ ప్రభుత్వంలోని ప్రతి ప్రజాప్రతినిధికి తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే మక్కువ ఉంటుంది. నేను కూడా ఎంపీగా గెలవబోయే పార్థసారథిని కలుపుకుని జిల్లాలోని అనుకూలమైన నియోజకవర్గాల్లో పర్యాటక కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రతి ఒక్కరికీ ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించే బాధ్యత కచ్చితంగా తీసుకుంటాం.

రామకృష్ణ, చేనేత కార్మికుడు..
ధర్మవరంలో పవర్‌లూమ్స్ విచ్చలవిడిగా ఏర్పాటు చేయడం మూలంగా చేనేత వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. చేనేత పరిశ్రమకు పూర్వవైభవం తీసుకురావడానికి ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు?

సత్యకుమార్‌యాదవ్: వైసీపీ పాలనలో సీఎం జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డి చేతగానితనం కారణంగా చేనేత పరిశ్రమ నిర్వీర్యమైపోయింది. సాక్ష్యాత్తు జగన్ ఎన్నో హామీలిచ్చారు. ఒక్కటి కూడా నెరవేర్చలేదని అందరికీ తెలుసు. కేతిరెడ్డి చేనేత పరిశ్రమను అడ్డుపెట్టుకుని దోచుకోవడం తప్ప.. వారికి చేసిన సాయం ఏమీలేదు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలను తామే ఇస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నారు. చేనేత వ్యవస్థను ఎలా అభివృద్ధి చేయాలో ఇప్పటికే పరిటాల శ్రీరామ్‌తో కలిసి ప్రణాళిక సిద్ధం చేసుకున్నా. కేంద్ర ప్రభుత్వ పథకాలు అనేకం ఉన్నాయి. వాటన్నింటితోపాటు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను చేనేతలకు వర్తింపజేసి, అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తా.


బరిలో ఉండేదెవరో?

నేటితో ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ
రెబల్స్, స్వతంత్రులను బుజ్జగించే పనిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు



పుట్టపర్తి, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం సోమవారంతో ముగియనుంది. మధ్యాహ్నం 3 గంటల్లోపు ఎన్నికల బరి నుంచి తప్పుకునే వారు నామినేషన్లు వెనక్కి తీసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో 98 నామినేషన్లను ఎన్నికల అధికారులు ఆమోదించారు. వాటిలో ఎంపీకి 15, ఎమ్మెల్యే స్థానాలకు 83 దాఖలయ్యాయి. వీటిలో ప్రధాన పార్టీలకు చెందిన వ్యక్తులు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. వీరిని బరి నుంచి తప్పించేందుకు ఆయా పార్టీల నాయకులు సంప్రదింపులు, బుజ్జగింపులు సాగిస్తున్నారు. ఆ యా పార్టీల కార్యాలయాల్లో ఆదివారం నాయకులు ఎలాగైనా బరి నుంచి తప్పుకోవాలంటూ బుజ్జగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎవరెవరు ఉపసంహరించుకుంటారో, బరిలో ఎవరు మిగులుతారోనన్న ఉత్కంఠ నెలకొంది.

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	41.0 27.0	41.0 27.0	42.0 28.0	41.0 26.0	41.0 27.0



ఎన్నికల సిత్రాలు

బుల్లెట్టు బండెక్కి..



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ బుల్లెట్ నడిపారు. మండలంలోని బూదగవి గ్రామంలో ఆదివారం ఎన్నిక ప్రచారంలో పాల్గొనేందుకు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా బుల్లెట్ నడిపి కార్యకర్తలు, నాయకులలో జోష్ నింపారు.

- ఉరవకొండ

అభిమానం ఆకాశం ఎత్తున ..!



ఆ నాయకులపై ప్రజాభిమానం ఆకాశం ఎత్తు నుంచి పూల వర్షం కురిపించింది. తమ అభిమాన నాయకులు ఊరికి వస్తున్నారనే సమాచారంతో ఆ గ్రామ కార్యకర్తలు ఎక్స్‌కవేటర్‌పై నిలబడి పూల వర్షం కురిపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి అగళి మండలం పి.బ్యాడికెర గ్రామం వెళ్లారు. ఆ సందర్భంగా అగళి జడ్పీటీసీ ఉమేష్, పార్టీ మండల కన్వీనర్ కుమార్‌స్వామి ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు ఎక్స్‌కవేటర్ ఎక్కి పూలవర్షం కురిపించారు.

- అగళి

భయపడకు తల్లీ.. గెలుపునీదే !




ఏం దిగులు వద్దు తల్లీ. నీ గెలుపు గ్యారెంటీ అన్నట్లు ఓ వృద్ధుడు శింగనమల టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీని ఆశీర్వదించాడు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె గార్లదిన్నె మండలం పెనకచెర్ల గ్రామంలో పర్యటించారు. ఆ సందర్భంగా వృద్ధులను పలుకరిస్తూ టీడీపీ ప్రకటించిన పథకాలు వివరిస్తూ ముందుకు సాగారు. ఈక్రమంలోనే ఓ వృద్ధుడు ఆమె తలపై చేయిపెట్టి ఆశీర్వదించారు.

- గార్లదిన్నె

ఫినిష్ ఆంధ్ర..!

ఫిష్ ఆంధ్రా పేరుతో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మత్స్యకారులకు వల విసిరారు. షాపులు తెరుచుకోండి.. సముద్రజాతుల చేపలు తక్కువ ధరలకే సరఫరా చేస్తామని, అధిక లాభాలు పొందవచ్చని అధికారులు ఆశ చూపారు. వారి మాటలను నమ్మిన పలువురు ఔత్సాహికులు సుమారు 50 ఫిష్ ఆంధ్ర షాపులను తెరిచారు. వారు చెప్పిన విధంగా సముద్ర జాతుల చేపలను సరఫరా చేయలేదు. స్థానికంగా లభించే వాటినే బయటికంటే అధిక ధరలకు సరఫరా చేశారు. ఔత్సాహికుల ఆశలపై నీళ్లు చల్లారు. విధిలేక వారు ఆ షాపులను మూసేశారు.



ఫిష్ ఆంధ్రా షాపులో నిరుపయోగంగా ఉన్న సామగ్రి

ఆక్వా హబ్ అట్టర్‌ఫ్లాప్

ఉత్తుత్తి మాటలుగా సీఎం జగన్ హామీ

హార్బర్ తరహాలో వ్యాపారాలంటూ మోసం

తక్కువ ధరలకే సముద్రజాతుల చేపలంటూ మత్స్యకారులకు వల

వ్యాపారాల్లేక ఫిష్ ఆంధ్రా షాపుల మూత

అనంతపురం ప్రెస్‌క్లబ్

'మత్స్యకారుల అభివృద్ధే తమ ధ్యేయం... వారికి మత్స్య సంపదను అందిస్తాం... అందులో భాగంగా జిల్లాకో ఆక్వా హబ్ ఏర్పాటు చేస్తాం' అని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి 2020 నవంబరు 21న మత్స్యకార దినోత్సవం సందర్భంగా హామీ ఇచ్చారు. ఆ మాటలు నమ్మిన మత్స్యకారులు సంబరపడిపోయారు. తీరా చూస్తే అవి ఒట్టిమాటలేనని తేలడంతో ఆ వర్గాలకు నిట్టూర్పు తప్పలేదు. రూ. కోటితో ఆక్వా హబ్‌ను ఎలా నిర్మించాలనుకున్నారో అంతుచిక్కని ప్రశ్నగా మారింది. సముద్రతీర ప్రాంతాల సమీపంలో ఉండే ఆక్వా హబ్‌లు ఏర్పాటు చేయాలంటే దాదాపు రూ. 4 కోట్ల వరకూ ఖర్చవుతున్నట్లు సమాచారం. ఆక్వా హబ్ ఏర్పాటుకు అంచనాలు, ఖర్చు ఇవన్నీ తెలిసి ప్రభుత్వం ప్రకటించిందా...? లేదా గొప్పలు పోవడానికి ఆక్వా హబ్‌ను ప్రకటించిందా.. అన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఆక్వా హబ్ నిర్వీర్యమిలా..

జిల్లాలో ఆక్వా హబ్ ఏర్పాటు కావాలంటే దానికి అనుసంధానంగా 178 మినీ ఫిష్ వెండింగ్ యూనిట్లు ఉండాలి. ఆ తరహాలో యూనిట్లు ఏర్పాటైతేనే హబ్ నడిపే వెసులుబాటు ఉంటుంది. అప్పుడే హబ్‌లో పలు రకాల సముద్రజాతుల చేపలను నిల్వ చేసుకొని యూనిట్లకు సరఫరా చేయవచ్చు. ఇవన్నీ అసాధ్యమని తెలిసినప్పటికీ గొప్పలు పోయారు. జిల్లాలో హబ్ ఏర్పాటుకు రూ. కోటితో అంచనా వేసిన ప్రభుత్వం చేతులు దులుపుకుంది. హబ్ ఏర్పాటు కావాలంటే సుమారు ఆరేడు కోట్లు అవుతున్నట్లు అధికారిక లెక్కల ద్వారా తెలుస్తోంది. నాలుగేళ్లుగా ఎంతోమంది పారిశ్రామికవేత్తలను ఆహ్వానించినా.. ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో ఏర్పాటు చేయలేమని వెనక్కు వెళ్లిపోయారు. హబ్ ఏర్పాటుకు ఓ ప్రముఖ సంస్థ ముందుకొచ్చినప్పటికీ.. 178 యూనిట్లలో కనీసం 50 మినీ ఫిష్ వెండింగ్ యూనిట్లనైనా ఏర్పాటు చేయాలని మెలికపెట్టారు. నాలుగేళ్లుగా అధికారులు ఎంత ప్రయత్నించినప్పటికి 50 ఫిష్ ఆంధ్రా షాపులను ప్రారంభించగలిగారు. అవికూడా మత్స్య సహకార సంఘాల్లో ఉన్న వారితోనే తెరిపించినట్లు ఆ శాఖ వర్గాల ద్వారా అందిన సమాచారం. ఆ షాపులకు హబ్ ప్రమోటర్లు అందించే చేపలు అధిక ధరలు ఉండటంతో... విక్రయించలేక దాదాపు 30కిపైగా దుకాణాలను మూసేశారు. మరికొందరు అవే షాపుల్లో చికెన్‌సెంటర్లు, మటన్ సెంటర్లు నిర్వహించుకుంటున్నారు. దీంతో ఆ ప్రముఖ సంస్థ హబ్ నుంచి తప్పుకుంది. ఇలా జిల్లాలో ఆటంకాల మధ్య ఆక్వా హబ్ నిర్వీర్యమైపోయింది.

ఫిష్ ఆంధ్రాతో నష్టపోయిన మత్స్యకారులు

'రోడ్డు పక్కన వ్యాపారం వద్దు.. నాణ్యమైన చేపల మాంసాన్ని అమ్ముదాం. వినియోగదారులను మనవైపు తిప్పుకుందాం.. లాభాలు గడిద్దాం' అని మత్స్యశాఖ అధికారులు జిల్లాలోని పలువురు మత్స్యకారులు, ఔత్సాహికులతో బలవంతంగా షాపలను తెరిపించారు. రూ. 30 వేలు పెట్టుబడి పెట్టండి... షాపు చూపించండి... అంతా మేము ఏర్పాటు చేస్తాం.. బయటి మార్కెట్లో కన్నా.. కిలో చేపలపై రూ. 10 తగ్గింపుతో ఇస్తాం.. అని చెప్పి నగరంలో ఫిష్ ఆంధ్రా పేరుతో చేపల యూనిట్లను ఏర్పాటు చేశారు. లాభాలొస్తాయని కొందరు మత్స్యకారులు, ఔత్సాహికులు ఆశపడి రూ. 30వేలు చెల్లించి మరీ షాపులను తెరిచారు. పట్టుమని నెలరోజులు కూడా వారు చెప్పిన మాట మేరకు చేపలను ఇవ్వలేకపోయారు. తక్కువ ధరలు అటుంచితే.. కనీసం తాము కోరిన రకం చేపలైనా ఇవ్వండయ్యా వ్యాపారాలు చేసుకుంటామన్నా అధికారులు పట్టించుకోలేదు. దీంతో మత్స్యకారులు, ఔత్సాహికులు ఫిష్ ఆంధ్రా షాపులను మూసేశారు.



నట్టేట ముంచారు

నేను చేపలు పట్టుకొని బళ్లారి బైపాస్, కళ్యాణదుర్గం బైపాస్ రోడ్లలో అమ్ముకునేవాడిని. మార్కెట్లో చేపలు కొనుక్కొచ్చి వ్యాపారం చేసుకునేడివాడిని. కిలో రూ. 100లు పడేవి. ఫిష్ ఆంధ్రా షాపుల్లో రకరకాల చేపలు వస్తాయి.. జనాలు బాగా వస్తారు.. వ్యాపారాలు బాగా అవుతాయి అంటే రూ. 30 వేలు కట్టాను. షాపులో అయితే అన్ని చూసేకి బాగానే ఉన్నాయిగానీ... వాళ్లు చెప్పినట్లు మాకేమీ సముద్రంలో లభించే చేపలు వేయలేదు. మామూలు మార్కెట్లో లభించే కట్లా, రోహూ, జిలేబీలే ఇచ్చారు. అవి కూడా కిలో రూ. 120తే ఇచ్చారు. ఆ రేట్లతో చేపల అమ్ముడుపోక షాపును మూసేశాను. షాపు ముందరే బయట రోడ్డు మీద చేపల పెట్టుకొని అమ్ముకుంటున్నాను. ఏం చేస్తాం లాభాలంటూ షాపులు పెట్టిచ్చి నట్టేట ముంచారు.

- ఓ నిర్వాహకుడి ఆవేదన

హలో..! ఏనప్ప నిమ్మూరల్లి యారు గెలితారే..?



రాయదుర్గం, ఏప్రిల్ 28: హలో..! ఏనప్పా నిమ్మూరల్లి యారు గెలితారే..?(ఏమప్పా మీ ఊరిలో ఎవరు గెలుస్తారు) అంటూ రాయదుర్గం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఫోన్‌లో ఆరాలు తీయడం ఎక్కువైంది. కర్ణాటకకు సరిహద్దులో ఉండటంతో ఈ నియోజకవర్గంలోని అధికశాతం ప్రజలు కన్నడ ఎక్కువగా మాట్లాడతారు. ఇక్కడి ప్రజలకు బెంగళూరు, బళ్లారి, చిత్రదుర్గం, చెళ్లకెర ప్రాంతాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో బంధుత్వాలు ఉన్నాయి. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ జరుగుతుండటంతో రోజూ సెల్‌ఫోన్‌లలో కన్నడ భాషలో అక్కడి ప్రాంత బంధువులు, మిత్రులు వ్యాపారులు మీ ఊరిలో జరుగుతున్న ఎన్నికల్లో ఎవరు గెలుస్తారని అడుగుతున్నారు. హోటళ్లు, కూడళ్ల వద్ద సరిహద్దు గ్రామాల్లో, సెల్‌ఫోన్‌లలో ఇదే చర్చ ప్రస్తుతం జరుగుతోంది. అంతే కాకుండా రాయదుర్గం నుంచి బెంగళూరుతో పాటు ఇతర ప్రాంతాలకు కర్ణాటక బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తాయి. ఆ బస్సుల్లో కూడా ప్రయాణికుల మధ్య కన్నడ భాషలో రాజకీయ చర్చలే జరుగుతున్నాయి.

ఏపార్టీకైనా బ్యాండ్ వాయిస్తాం



కొర్తికోటలో బ్యాండ్‌బాజా వాయిస్తున్న కళాకారులు

వారు ఏపార్టీకైనా బ్యాండ్ వాయిస్తారు. ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగాలన్నా, పార్టీవారు ఊరిలోకి వచ్చారని తెలియాలన్నా, వీరే బ్యాండ్ బాజాదే ముఖ్య పాత్ర. ఎన్నికల సమయం కావడంతో బ్యాడ్ వాయించే వారిని అన్నిపార్టీలు తమ ప్రచారానికి వినియోగించుకుంటున్నారు. కదిరి నియోజకవర్గంలో ఏగ్రామం, పట్టణంలో ప్రచారం జరిగినా ముందు బ్యాండ్‌బాజా వాయించేవారే ఉంటారు. ఆదివారం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ తనకల్లు మండలంలోని కొర్తికోట గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఒకగ్రూపులో పదినుంచి 15మంది సభ్యులు ఉంటారు. రోజుకు రూ.10వేల నుంచి 15వేలు సంపాదన ఉంటుంది. ఎన్నికల ప్రచారం ప్రారంభమైనప్పటినుంచి బ్యాండ్‌కు డిమాండ్ పెరిగింది. మామూలుగా శుభ కార్యక్రమాలకు నెలలో పది, 15రోజులు మాత్రమే పని ఉంటే ఎన్నికల సమయంలో రోజూ పని ఉంటోందని పలువురు బ్యాండ్ సిబ్బంది పేర్కొన్నారు.

- కదిరి

ఇదేం రాజకీయం..

బోరుబావి తవ్వకుండా అడ్డుకున్న వైసీపీ నాయకులు



విచారిస్తున్న అధికారులు

ఉరవకొండ, ఏప్రిల్ 28: పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో గుక్కెడు నీటి కోసం ఆ కాలనీ ప్రజలు చేస్తున్న ప్రయత్నాలను కొందరు వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వివరాలు ఇలా.. పట్టణంలోని కోట వీధిలో తాగు నీటి సమస్య తీవ్రం కావడంతో కాలనీవాసులు సొంతంగా బోరు వేసుకోవడానికి విరాళాలు సేకరించారు. శనివారం రాత్రి బోరు వేసుకునేందుకు కాలనీ వాసులు ప్రయత్నించారు. దాన్ని కొందరు వైసీపీ నాయకులు అడ్డుకుని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ కాలనీకి ఆదివారం అధికారులు విచారణకు వెళ్లారు. రంజాన్ పండుగ ముందే నీటి సమస్య తీర్చాలని అధికారులను కాలనీ వాసులు కోరారు. కొత్తగా బోరు వేయడానికి తమ వద్ద నిధులు లేవని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. దీంతో కాలనీవాసులు సొంతంగా బోరు వేసుకోవడానికి విరాళాలు సేకరించుకున్నారు. అధికారుల అనుమతితోనే బోరు వేయడానికి యత్నించగా, వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో కాలనీ వాసులు అంతా తిరగబడ్డారు. వైసీపీ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. తమ నీటి సమస్యను తీర్చాలని విచారణకు వచ్చిన అధికారులను ప్రజలు నిలదీశారు.

భవిష్యత్తును కాపాడేవారినే ఎన్నుకోండి

జడ్పీ సీఈఓ మైఖోమ్ నిదియా



ర్యాలీలో జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఎన్నికల నిఘా వేదిక సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 28: ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని, భవిష్యత్తును కాపాడే నాయకులను ఎన్నుకోవాలని జడ్పీ సీఈఓ మైఖోమ్ నిదియా పేర్కొన్నారు. ఓటు ప్రాధాన్యంపై అవగాహన కల్పించేందుకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన ర్యాలీని జడ్పీ సీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు పౌరులకు వజ్రాయుధమని తెలిపారు. ప్రతి ఓటరు అవినీతి లేని సమాజ స్థాపన, అభివృద్ధిని కాంక్షించే నాయకులను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకోని ప్రజలు సమస్యలు పరిష్కరించాలని అడిగే హక్కు కోల్పోతారని తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్, శ్రీకంఠం సర్కిల్, రాజురోడ్డు, సప్తగిరిసర్కిల్, సుభాష్‌రోడ్డు, టవర్‌క్లాక్ మీదుగా ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ లలితాబాయి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా ప్రతినిధి మమత, ఎన్నికల నిఘావేదిక రీజనల్ కన్వీనర్ కంబదూరు షేక్ నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

చెలామనీ మారింది



కనుమరుగైన పెద్దనోట్లు.. రూ.500దే హవా

హిందూపురం/రాయదుర్గం, ఏప్రిల్ 28: కొన్నేళ్ల కిందట ఎన్నికలంటే హామీలు, వాగ్దానాలు మాత్రమే ఉండేవి. మారిన పరిస్థితుల్లో ఎన్నికలను డబ్బు, మద్యం ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికలు వచ్చాయంటే కొన్ని ప్రాంతాల్లో మద్యం ఏరులైపారుతుంది. డబ్బు పంపిణీ కూడా విచ్చలవిడిగా జరుగుతోంది. పెద్దనోట్ల రద్దుతో ప్రస్తుత ఎన్నికల్లో రూ.500 నోట్ల హవా నడవనుంది. వద్దు వద్దంటూనే ఓటుకు నోటు తీసుకోవడం కొందరు ఓటర్లకు అలవాటుగా మారింది. అభ్యర్థిలో మంచి గుణాలకన్నా, శ్రీమంతుడైతే ఓట్లు కొంటాడని, ఎక్కువ మొత్తం ఇస్తాడని ఆశిస్తుంటారు. 2014లో ఎన్నికలు జరిగిన సమయంలో రూ.వెయ్యి నోటు అందుబాటులో ఉంది. దీంతో ఆ నోట్ల కట్టలు తరలించేందుకు, పంచేందుకు కొందరు అభ్యర్థులు పెద్దగా ఇబ్బంది పడలేదు. ఆ తర్వాత రెండేళ్లకే ఆనోటును రద్దు చేశారు. అయితే 2019 ఎన్నికల సమయంలో రెండు వేల రూపాయల నోటు అందుబాటులో ఉండటం అభ్యర్థులకు బాగా కలిసివచ్చింది. అభ్యర్థుల అనుచరులు సులభంగా డబ్బును తరలించడంతో పాటు పంపిణీ కూడా చేసేశారు. గత ఏడాది ఈ నోటును కూడా ఆర్బీఐ రద్దు చేసింది.



నాయకుల నిట్టూర్పు

ఇలా వెయ్యి, రూ.2వేల నోట్లు కనుమరుగు కావడంతో ఇచ్చి పుచ్చుకోవడానికి సులభంగా ఉండేపెద్ద నోట్లు పోయాయని నాయకులు నిట్టూరుస్తున్నారు. ఎన్నికల సమయంలో పంచేందుకు అభ్యర్థికి, తీసుకునేందుకు ఓటరుకు సులభంగా ఉండే పెద్దనోట్లు రద్దు కావడం కొంత మేర ఇబ్బందిగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం చలామణిలో ఉన్న పెద్ద నోటు రూ.500దే ఎన్నికల్లో హవా నడుస్తోంది. ఈ ఎన్నికల్లో నాయకుల వద్ద ఎటుచూసినా ఈ నోటే కనిపిస్తోంది.

రూ. 50 లక్షలు స్వాధీనం

గుంతకల్లు, ఏప్రిల్ 28: రైళ్లల్లో మద్యం, గంజాయి తదితర మాదక ద్రవ్యాల రవాణా, డబ్బు తరలింపులపై నిఘా పెట్టిన ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అనధికారికంగా ఉంచిన రూ. 50 లక్షల నగదు లభ్యమైంది. ఆదివారం రైళ్లల్లో, ప్లాట్‌ఫారాలపై ఉన్న ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేస్తుండగా పెద్ద మొత్తంలో నగదు దొరికింది. పట్టణంలోని కసాపురం రోడ్డులోని సాయి హనుమాన్ అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్న అర్చన కార్వా అనే మహిళ 1వ నెం. ప్లాట్‌ఫారం ఎంట్రెన్సులో ఉండగా, ఆమె లగేజీ బ్యాగును అధికారులు తనిఖీ చేశారు. అందులో రూ. 50 లక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు కనుగొన్నారు. ఈ నగదుకు సంబంధించి తగిన ఆధారాలు లేకపోవడంతో డబ్బును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎస్ సుబ్బలక్ష్మి, జీఆర్పీ ఎస్ఐ ఎం రామదాసు సీజ్ చేశారు.



సీజ్ చేసిన నగదును చూపుతున్న జీఆర్పీ సీఐ నగేశ్‌బాబు

ప్లీజ్..! మా మాట వినండి

మీకేమి కావాలో చెప్పండి

అభ్యర్థుల విత్‌డ్రా కోసం కొందరు, కొనసాగాలని మరికొందరి ఆఫర్

అభ్యర్థుల వెంట పడుతున్న ప్రధాన పార్టీలు

నామినేషన్ల ఉపసంహరణలకు నేటితో ముగియనున్న గడువు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 28 'బాబ్బాబు..! ప్లీజ్ మా మాట వినండి. మీకేమి కావాలో చెప్పండి. చేసి పెడతాం' అంటూ ప్రధాన పార్టీలు నామినేషన్లు వేసిన ఇతర అభ్యర్థులను ప్రాధేయపడుతున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటికే నామినేషన్ల ఘట్టం పూర్తయ్యింది. ప్రస్తుతం అనంత పార్లమెంటు స్థానానికి 21మంది, జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 136 మంది బరిలో ఉన్నారు. ఇందులో రాయదుర్గం నియోజకవర్గం నుంచి 14మంది, ఉరవకొండ నియోజకవర్గం నుంచి 11, గుంతకల్లు నియోజకవర్గం నుంచి 17, తాడిపత్రి నియోజకవర్గం నుంచి అత్యధికంగా 26, శింగనమల నియోజకవర్గం నుంచి 16, అనంతపురం అర్బన్‌నుంచి 21, కళ్యాణదుర్గం నుంచి 16, రాప్తాడు నియోజకవర్గం నుంచి 11మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అయితే ఎన్నికల కమిషన్ షెడ్యూల్ మేరకు ఈ అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి సోమవారం వరకు గడువు ఉంది. ఉదయం నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లను ఉపసంహరించు కోవచ్చు.

ప్రధాన పార్టీల ఎత్తుకు పైఎత్తులు

ఈసారి అసెంబ్లీ ఎన్నికలు ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, వైసీపీలకు చాలా కీలకంగా మారాయి. అధికారంలో ఉన్న ఉన్న వైసీపీ ఎలాగైనా గెలవాలనే తలంపుతో తొలి నుంచే అక్రమ వ్యవహారాలకు తెర తీసింది. తాజాగా నామినేషన్ల ఉపసంహరణ విషయంలో కూడా వైసీపీ కుట్రలు పన్నుతూ వస్తోంది. టీడీపీ అభ్యర్థులకు ఏవిధంగా నష్టం చేయవచ్చో ప్రణాళిక రచిస్తోంది. టీడీపీ అభ్యర్థుల పేర్లు ఉన్న కొంతమందిని ఎన్నుకొని వారితో నామినేషన్లు వేయించారని చెబుతున్నారు. ప్రధానంగా రాయదుర్గం, ఉరవకొండ, రాప్తాడు, అనంతపురం అర్బన్, గుంతకల్లు నియోజకవర్గాలలో ఇలాంటి కుతంత్రాలు పన్నినట్లు తెలుస్తోంది. రాయదుర్గంలో టీడీపీ అభ్యర్థి పేరును పోలి ఉన్న కావలి శ్రీనివాసులు, కురబశ్రీనివాసులతో నామినేషన్ వేయించారు. వారివల్ల టీడీపీకి పడే కొన్ని ఓట్లయినా పక్కకు పోతాయిని దానివల్ల కొంత లాభపడవచ్చని వైసీపీ ఆలోచిస్తోంది. అయితే కావలి శ్రీనివాసులను విత్‌డ్రా చేయించడానికి టీడీపీ ప్రయత్నిస్తుండగా పోటీలో నే ఉండేలా చూసేందుకు వైసీపీ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రాప్తాడు నియోజకవర్గంలో కూడా ఒక బీసీ వ్యక్తిని టీడీపీకి వ్యతిరేకంగా నామినేషన్ వేయించారు. ఆయనను ఉపసంహరించుకోవడానికి టీడీపీ ప్రయత్నిస్తుంటే ఆపని జరగకూడదని అధికార వైసీపీ అభ్యర్థి విశ్వప్రయత్నాలు చేస్తున్నార న్న ప్రచారం జరుగుతోంది. తాడిపత్రి, ఉరవకొండ, అనంతపురం నియోజక వర్గాలలో కూడా ఇలాగే అధికార, ప్రతిపక్షా మధ్య ఎత్తుకు పైఎత్తులు సాగుతున్నాయి.



కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా

ఎన్నికల తేదీ సమీపిస్తుండటంతో జిల్లా యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ఉండటంతో కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి వినోద్ కుమార్ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. ఎంపీ అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ కలెక్టరేట్‌లోను, అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఆయా నియోజకవర్గ ఆర్‌ఓ కార్యాలయాలలోను కొనసాగుతోంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ విత్ డ్రాకు అవకాశం ఉంటుంది. ఈనేపథ్యంలో ఆయా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

ఫైనల్ జాబితా నేడే

ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థుల తుది జాబితా సోమవారం సాయంత్రం అధికారికంగా వెల్లడించనున్నారు. ప్రస్తుతం అనంతపురం పార్లమెంటుకు 21మంది, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు కలిపి 136 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత మిగిలే అభ్యర్థులే ఈఎన్నికలలో పోటీచేసే ఫైనల్ అభ్యర్థులుగా బరిలో ఉంటారు.

ఇళ్ల వద్దకే పింఛన్..



అనంతపురం క్లాక్‌టవర్/టౌన్, ఏప్రిల్ 28 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో లబ్ధిదారులకు ఎట్టకేలకు ఇంటివద్దే పింఛన్ సొమ్ము పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆదివారం కలెక్టర్ వినోద్‌కుమార్, డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నరసింహారెడ్డి పింఛన్ పంపిణీ మార్గదర్శకాలను విడుదల చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పింఛన్‌దారులకు మే, జూన్ నెలలకు సంబంధించి బ్యాంకు ఖాతాలకు లేదా ఇంటివద్దకే సొమ్ము అందజేయనున్నట్లు వెల్లడించారు. పింఛన్‌దారులు సచివాలయాలు, ఇతర కార్యాలయాల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. మే, జూన్ నెలలకు సంబంధించి పింఛన్ లబ్ధిదారుల ఆధార్ అనుసంధానమైన ఎన్‌పీసీఐ ద్వారా నిర్ధారించిన బ్యాంకు ఖాతాలకు జమచేస్తామన్నారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాని పింఛన్‌దారులకు, ప్రత్యేక కేటగిరి విభిన్నప్రతిభావంతులు, మంచానికే పరిమితమైన వారికి, దీర్ఘకాలిక వ్యాధి బాధితులకు, నడవలేని స్థితిలో ఉన్న లబ్ధిదారులకు ఇళ్ల వద్దే పింఛన్ పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఈనెల 30న ఆయా మండలాల గ్రామ సచివాలయాలు, మున్సిపాలిటీల వార్డు సచివాలయాలల్లో పింఛన్ సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమచేసిన వివరాలు అందుబాటులో ఉంచుతామన్నారు. బ్యాంకు ఖాతాల్లో జమకాని వారికి 3వతేదీన ఇంటివద్దే పింఛన్ పంపిణీ చేస్తామని తెలిపారు. డీఆర్‌డీఏ అధికారులతో పాటు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. మే 1న సెలవు కావడంతో 2న అన్ని బ్యాంకుల్లో పింఛన్ పంపిణీకి సరిపడు సొమ్మును అందుబాటులో ఉంచుకోవాలని బ్యాంకర్లకు ప్రభుత్వం సూచించింది.

జోరుగా పూల వ్యాపారం



పెళ్లిళ్లు, శుభకార్యాలు పెద్దగా లేకపోయినా ఎన్నికల పుణ్యమా అని పూల వ్యాపారం మూడు బొకేలు, ఆరు దండలుగా జోరుగా సాగుతోంది. నామినేషన్లు, ప్రచార పర్వంలో నాయకులు, కార్యకర్తలు తమ అభిమాన నేతలను సన్మానించేందుకు పూల దండల కోసం బారులు తీరుతున్నారు. గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వస్తున్న నాయకులను సన్మానించేందుకు పూలమాలలు, పుష్పగుచ్ఛాలు విరివిగా కొనుగోలు చేస్తుండటం వల్ల పూల వ్యాపారం జోరందుకుంది. నగరం, పట్టణం, గ్రామం అని తేడా లేకుండా అన్నిచోట్లా పూలకు ఒక్కసారిగా డిమాండ్ వచ్చింది. ముందుగానే అర్డర్లు ఇచ్చి మరీ దండలను తయారు చేయించుకుంటున్నారు.

- కొత్తచెరువు

పార్టీ మీటింగ్‌కు అందరూ రావాల్సిందే !

ఎంఎల్‌ఓ కుళ్లాయప్ప వాయిస్ మెసేజ్



విడపనకల్లు, ఏప్రిల్ 28: 'మీరు ఏమి చేసుకుంటారో.. ఏమో.. మీటింగ్‌కు అందరూ రావాల్సిందే. సోమవారం ఉదయం 8 గంటలకు ఉరవకొండ వైసీపీ ఆఫీసులో మీటింగ్ జరుగుతుంది. విశ్వేశ్వరరెడ్డి, ప్రణయ్‌రెడ్డి వస్తారు. మీరు వంద శాతం రావాల్సిందే' అని మండల ఎంఎల్‌ఓ కుళ్లాయప్ప శనివారం నుంచి వాట్సాప్ గ్రూపుల్లో వలంటీర్లకు వాయిస్ మెసేజ్ పంపుతున్నాడు. ఎన్నికలు సమీపిస్తున్నందున వైసీపీని ఎలా గెలిపించుకోవాలి అనే అంశంపై చర్చించేందుకు ఉరవకొండలో విశ్వేశ్వరరెడ్డి, ప్రణయ్‌రెడ్డి నియోజకవర్గంలోని వలంటీర్లతో సమావేశం నిర్వహించనున్నారు. రాజీనామా చేసిన వలంటీర్లు, చేయని వారు అందరూ హాజరు కావాలన్నారు. ఇదే వలంటీర్లకు చివరి సమావేశం అన్నారు. వారం రోజుల కిందట కూడా రాజీనామా చేయాలని వాట్సాప్‌లో వాయిస్ మెస్సేజ్‌లు పెట్టి వలంటీర్లను బెదిరించాడు. దీనిపై టీడీపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంఎల్‌ఓ వైసీపీ కార్యకర్తలాగా ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ ప్రచారం చేస్తున్నాడనీ, అతడిపై ఎన్నికల అధికారుల ఎందుకు చర్యలు తీసుకోవటంలేదని ప్రశ్నిస్తున్నారు.

ఓటు వేస్తూ సెల్ఫీ దిగడం నిషిద్ధం



పోలింగ్ కేంద్రంలో ఓటరు తన ఓటుహక్కును వినియోగించుకునే సమయంలో సెల్ఫీ దిగడం, ఇతరులకు చూపించడం నిషిద్ధం. ఒకవేళ అలా చేస్తే నిబంధన 49 ఎం(ఓటు రహస్యం) బహిర్గతం నియమం మేరకు ఎన్నికల అధికారులు గుర్తించి ఓటరును బయటకు పంపుతారు. ఆ ఓటును నిబంధన 17ఏలో నమోదు చేస్తారు. లెక్కింపు సమయంలో ఆ ఓటును పరిగణనలోకి తీసుకోరు. నిబంధన 49ఎం ప్రకారం అంధులైన ఓటర్లు తమ ఓటు వేయడానికి 18 సంవత్సరాలు దాటిన సహాయకుడిని వెంట తీసుకెళ్లవచ్చు. సహాయకుడు అతడి ఓటును బహిర్గత పరచనని నిబంధన 10లో ధ్రువీకరించాల్సి ఉంటుంది.

- కదిరిఅర్బన్

ఎన్నికల్లో పిల్లలతో పనులు చేయిస్తే చర్యలే

ఎన్నికల ప్రక్రియలో పిల్లలతో పనులు చేయించరాదని కమిషన్ చెబుతోంది. నిబంధనల మేరకు 18 సంవత్సరాల లోపు పిల్లలతో ఎలాంటి ఎన్నికల పనులు చేయించరాదు. బాలకార్మిక చట్టం ప్రకారం ఎన్నికల కార్యాలయాల్లో పనులు చేయించుకున్నా, కరపత్రాలు పంపిణీ చేసినా, ఫ్లెక్సీలు, జెండాలు కట్టించినా, ప్రచారంలో తిప్పినా సంబంధిత నాయకులు, కార్యకర్తలపై నిబంధనల ప్రకారం అధికారులు చర్యలు తీసుకోవచ్చు. పిల్లలను పనులకోసం ప్రోత్సహించే తల్లిదండ్రులను కూడా దోషులుగా పరిగణిస్తారు. తీవ్రత ఆధారంగా అభ్యర్థులపై కేసులు నమోదు చేసే అవకాశాలుంటాయి. ఈమేరకు ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేయవచ్చు.

- కదిరిఅర్బన్

అనంతకు మరో ఎన్నికల పరిశీలకుడు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ జిల్లాలో ఎలా చేపడుతున్నారో పరిశీలించడానికి కేంద్ర ఎన్నికల పరిశీలకులు జిల్లాకు వస్తున్నారు. ఇప్పటికే వ్యయ పరిశీలకులు, జనరల్ పరిశీలకులు ముగ్గురు జిల్లాకు చేరుకున్నారు. తాజాగా ఆదివారం గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల జనరల్ పరిశీలకులు మనీష్‌సింగ్ ఐఏఎస్ అనంతకొచ్చారు. ఆయన ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఉండగా అక్కడకు కలెక్టరు వినోద్ కుమార్ వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పరిశీలకులు తమ నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణ అక్కడి పరిస్థితులు గురించి కలెక్టరు ద్వారా అడిగి తెలుసుకున్నారు.

'ఆదరణ' ఏదీ..?



శింగనమల: టీడీపీ పాలనలో కులవృత్తులతో జీవనోపాధి పొందే వారు ఆర్థికంగా నిలుదొక్కుకోవడానికి అదరణ పథకం కింద పనిముట్లు అందజేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆపథకం ఎత్తివేశారు. అప్పట్లో చంద్రబాబునాయుడు కులవృత్తులు చేసేవారికి ఉచితంగా ఆదరణ పథకం కింద పనిముట్లు ఇచ్చారు. మా కుటుంబానికి కూడా రెండు కుర్చీలు వచ్చాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ కుర్చీ ద్వారానే కులవృత్తి చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నా. జగన్ వచ్చాక చేయూత పేరుతో ఏడాదికి రూ.10వేలు ఇస్తున్నాడు. మేము నాలుగురు అన్నతమ్ముళ్లం నాలుగు బంకులు వేసుకొని ఉన్నాము. వైసీపీ ప్రభుత్వం పెట్టిన నిబంధనలతో మాలో ఇద్దరికి మాత్రమే చేయూత పథకం లబ్ధి అందుతోంది. ఆనాడు చంద్రన్న ఇచ్చిన పనిముట్లతోనే ఇప్పటికీ మాకుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి.

- మణికుమార్, నాయీబ్రాహ్మణుడు, శింగనమల

పెంచిన పింఛన్ ఇవ్వడానికి ఐదేళ్లా..?



కదిరిఅర్బన్: గతంలో చంద్రబాబు ఇచ్చే రూ.రెండువేల పింఛన్‌ను జగన్ రూ.మూడువేలు చేస్తానని హామీ ఇచ్చారు. పెంచిన పింఛన్ ఇవ్వడానికి ఐదేళ్లు పట్టింది. ఏడాదికొక్కసారి రూ.250లు పెంచుతానని ఎన్నికలకు ముందు చెప్పలేదు. ఇపుడు ఇచ్చే రూ.మూడువేలకు రూ. ఐదవందలు పెంచి ఇస్తానంటున్నారు. ఇది కూడా మూడేళ్ల తరువాత ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతానని హామీ ఇస్తున్నారు. ఇది ప్రజలు నమ్మే స్థితిలో లేరు. చంద్రబాబు రూ.నాలుగువేలు ఇస్తానంటున్నారు. రూ.నాలుగువేలు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇస్తామంటున్నారు. ఇది పింఛన్‌దారులకు ఎంతో ఉపయోగం.

- పాపులమ్మ, ఎగువపల్లి, కదిరి మండలం

ఫ్యాన్ గాలికి... జగన్ హామీ



- హరీష్‌రెడ్డి, పాపంపేట, అనంతపురం రూరల్ మండలం.

అధికారంలోకి వస్తే ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని గత ఎన్నికలకు ముందు సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర యువతకు హామీ ఇచ్చారు. అయితే ఐదేళ్ల కాలంలో ఒక్కసారి కూడా జాబ్ క్యాలెండ్ విడుదల చేయలేదు. పైగా ఉన్నత విద్యను కూడా యువతకు దూరం చేశాడు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఆ హామీ ఫ్యాన్ గాలిలో కొట్టుకుపోయింది. ఐదేళ్ల కాలంలో ఒక్కటంటే ఒక్క పరిశ్రమకూడా రాలేదు. స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం లేదు. టీడీపీ పాలనలోనే ఉమ్మడి జిల్లాకు కియ పరిశ్రమ తెచ్చి ఎంతో మందికి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. అది కూడా లేకపోతే..ఇతరప్రాంతాలకు వెళ్లిపోయే పరిస్థితి. సంక్షేమంతోపాటు..అభివృద్ధి చేసేవారిని గెలిపించుకోవాలి.

- అనంతపురం రూరల్

రాప్తాడు పేరు వెనుక...

రాప్తాడు గ్రామం పక్కనే పండమేరు వంక ఉంది. అప్పట్లో ఆ వంకలో నిత్యం నీరు ప్రవహించేవి. బ్రిటీష్ వారు పరిపాలించే కాలంలో పండమేరు వంకను దాటేందుకు రాప్తాడు గ్రామస్థుల సహాయం తీసుకునేవారు. బ్రిటీష్ వారు వంకను దాటేందుకు తాడు (రోప్) ద్వారా గ్రామస్థుల సహాయంతో దాటేవారు. బ్రిటీష్ వారు వంకను దాటేటప్పుడు గ్రామస్థులతో రోప్ అని ఇంగ్లీష్‌లో, తాడు అని తెలుగులో మాట్లాడేవారు. రోప్, తాడు తీసుకురండి అని పిలిచేవారు. కాలక్రమేణా రోప్, తాడు అనే పదాలు రాప్తాడుగా మారాయి.



పేరూరు ప్రాజెక్టు

నియోజకవర్గ చరిత్ర

రాప్తాడు నియోజకవర్గం ఉమ్మడి జిల్లాలోనే ప్రత్యేకమైనది. రెండు జిల్లాల పరిధిలో విస్తరించి ఉండటం నియోజకవర్గ విశేషం. నియోజకవర్గంలో ఒక్క ప్రధాన పట్టణంగాని, మున్సిపాలిటీగాని లేవు. అన్ని మండలాల్లోనూ వ్యవసాయమే జీవనాధారంగా రైతులు, కూలీలు జీవనం సాగిస్తున్నారు. ఒకప్పుడు కనుచూపు మేర బీడు భూములే కనిపించేవి. అటువంటి తరుణంలో హంద్రీనీవా ప్రధాన కాలువ నియోజకవర్గంలో వెళ్లడంతో చాలా వరకూ సాగునీటి సమస్య తీరింది. పేరూరు ప్రాజెక్టుకు నీటి సరఫరా సమస్య అలాగే ఉంది. ఒకప్పుడు వేలాది మందికి ఉపాధినిచ్చిన రామగిరి మండలంలో బంగారు గనులు మూతపడ్డాయి. చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య తాండవిస్తోంది. గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్నాయి.

శ్రమజీవుల నేల


- రైతులు.. కూలీలు అధికం
- రెండు జిల్లాల పరిధిలో రాప్తాడు
- ప్రధాన పట్టణాలు, మున్సిపాలిటీలు లేవు
- హంద్రీనీవా వచ్చేదాకా బీడు భూములే..

రాప్తాడు, ఏప్రిల్ 28: పునర్విభజనలో భాగంగా 2009లో రాప్తాడు నియోజకవర్గం ఏర్పడింది. అంతకు ముందు రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాలు అనంతపురం నియోజకవర్గంలో ఉండేవి. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలు పెనుకొండ నియోజకవర్గంలో ఉండేవి. 2009లో రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు, రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలను రాప్తాడు నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఇప్పటికి మూడు సార్లు సాధారణ ఎన్నికలు జరిగాయి. 2009, 2014లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పరిటాల సునీత, 2019లో వైసీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విజయం సాధించారు. నియోజకవర్గం 2022 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉంది. మొత్తం జనాభా 3,46,090 మంది ఉన్నారు. 2009లో పరిటాల సునీతకు అత్యల్ప మెజార్టీ 1750 ఓట్లు, 2019లో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి 25,575 ఓట్ల అత్యధిక మెజార్టీ వచ్చింది.

ఎంత దూరమో..

రాప్తాడు నియోజకవర్గం జిల్లా కేంద్రమైన అనంతపురం నుంచి కర్ణాటక సరిహద్దు వరకూ విస్తరించి ఉంది. రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాలు జిల్లా కేంద్రమైన అనంతపురానికి కూత వేటు దూరంలో ఉన్నాయి. రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం కర్ణాటక ప్రాంతానికి సరిహద్దుగా ఉంది. అనంతపురం నుంచి చెన్నేకొత్తపల్లి వరకూ దాదాపు 50 కి.మీ 44వ జాతీయరహదారి విస్తరించి ఉంది.

రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గం - మండలాలు



సంవత్సరం	ఎమ్మెల్యే	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
2009	పరిటాల సునీత	టీడీపీ	తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి	కాంగ్రెస్	1750
2014	పరిటాల సునీత	టీడీపీ	తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి	వైసీపీ	7774
2019	తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి	వైసీపీ	పరిటాల శ్రీరామ్	టీడీపీ	25,575

ప్రస్తుత ఓటర్లు

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
రాప్తాడు	17,582	17,774	3	35,359
అనంతపురంరూరల్	39,517	40,438	7	79,962
ఆత్మకూరు	16,566	16,698	1	33,265
కనగానపల్లి	16,849	16,572	1	33,422
రామగిరి	14,786	14,404	0	29,190
చెన్నేకొత్తపల్లి	18,781	18,333	1	37,115
మొత్తం	1,24,081	1,24,219	13	2,48,313

నీరు కరువు

రామగిరి మండలం పేరూరులో పెన్నానదిపై 1950లో నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ. 1.80 కోట్లతో 2 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించారు. పెన్నానది నీరు, వర్షపు నీటితో ఈ ప్రాజెక్టుకు నీరు రావాలి. పెన్నానదిలో కర్ణాటకలో అక్రమ ప్రాజెక్టులు, చెక్ డ్యాంలు నిర్మించడం వలన ఈ ప్రాజెక్టుకు నీరు రావడం కష్టంగా మారింది. ఈ ప్రాజెక్టులో నీరు సమృద్ధిగా ఉంటే 11 వేల ఎకరాల ఆయకట్టు భూమి సాగులోకి వస్తుంది. రామగిరి, కంబదూరు, కనగానపల్లి, రాప్తాడు మండలాల్లో బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతాయి. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాదయాత్ర సమయంలో రామగిరి మండలంలో పర్యటించినప్పుడు పేరూరు ప్రాజెక్టు గురించి వివరించి నీరు తీసుకురావాలని పరిటాల సునీత విన్నవించారు. 2014 నుంచి 2019 వరకూ ఆమె మంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబుతో మాట్లాడి జీడిపల్లి జలాశయం నుంచి కృష్ణా జలాలు పేరూరు డ్యాంకు వచ్చేలా 62 కి.మీ కాలువ తవ్వేందుకు దాదాపు రూ.803 కోట్లు నిధులు మంజూరు చేయించారు. కాలువ పనులు చేపడుతున్న సమయంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు నిలిపి వేశారు.



చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి నుంచి ఆమిదాలకుంట వరకూ అధ్వానంగా ఉన్న రోడ్డు



మౌనగిరి హనుమాన్ క్షేత్రంలో 39 అడుగుల ఏకశిలా విగ్రహం



ఇవే కీలకం..

రాప్తాడు నియోజకవర్గంలో ఎక్కువగా వ్యవసాయం, పాడి, గొర్రెల పెంపకంపై ఆధారపడి ప్రజలు జీవనం సాగిస్తున్నారు. చెరువులకు నీరు సరఫరా చేయకపోవడంతో రైతులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహంగా ఉన్నారు. ముఖ్యంగా 10 ఎకరాల సాగు భూమి ఉన్న వారికి పింఛన్లు, రేషన్ కార్డులు తొలగించారు. వారంతా ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధమయ్యారు. రాప్తాడులో నియోజకవర్గంలో బీసీ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ముఖ్యంగా కురుబ, బోయ కులస్థుల ఓటర్లు ఎక్కువగా ఉన్నాయి. బీసీ ఓటర్లు ఏ పార్టీకి మద్దతు తెలిపితే వారే విజయం సాధిస్తారు

పరిటాల ముద్ర

రాష్ట్రంలో రాప్తాడు అంటే పరిటాల అనే ముద్ర పడింది. ఒకప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు కలిగిన వ్యక్తి పరిటాల రవీంద్ర. ఆయన మరణానంతరం పరిటాల సునీత రాజకీయ ప్రవేశం చేశారు. 2009లో రాప్తాడు నుంచి పోటీ చేసి గెలుపొందారు. అప్పుడు రాష్ట్రంలో టీడీపీ అధికారంలో లేకపోయినా నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. 2014లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది 2019 వరకూ ఐదేళ్లు మంత్రిగా పని చేశారు. ఆ సమయంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.



పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

తొలి ఎమ్మెల్యే..



రాప్తాడు నియోజకవర్గంలో మొదటిసారి 2009లో ఎన్నికలు జరిగాయి. టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై 1750 ఓట్ల మెజార్టీతో మొదటి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత వైసీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై 7,774 ఓట్ల మెజార్టీతో రెండోసారి గెలిచారు. 2014 నుంచి 2019 వరకూ మొదటి రెండున్నరేళ్లు పౌరసరఫరాల శాఖ మంత్రిగా, తరువాత రెండున్నరేళ్లు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు.

రెండు జిల్లాల పరిధి...

2023లో జిల్లాల పునర్విభజన చేసినప్పుడు రాప్తాడు నియోజకవర్గాన్ని రెండుగా విభజించారు. నియోజకవర్గంలోని రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాలను అనంతపురం జిల్లాలో కలిపారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలను శ్రీ సత్యసాయి జిల్లాలో కలిపారు. మూడు మండలాలను ఒక జిల్లాలో, మరో మూడు మండలాలను ఇంకొక జిల్లాలో కలపడం ద్వారా అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.

మూతపడిన బంగారు గనులు



మట్టిలో నుంచి బంగారు ఉత్పత్తి చేసేందుకు రామగిరిలో 1984లో భారత్ గోల్డ్ మైన్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వం బంగారు గనులు ఏర్పాటు చేసింది. బంగారు గనులు ఏర్పాటు చేయడం ద్వారా మూడు వేల మందికి అప్పట్లో ఉపాధి కలిగింది. నష్టాలు అధికం కావడంతో 2001లో బంగారు గనులు మూత పడ్డాయి. దీంతో గనులను నమ్ముకున్న కార్మికులు ఉపాధి కోల్పోయారు. ప్రస్తుతం బంగారం ధర బాగా పెరిగింది. బంగారు గనులను ప్రారంభిస్తే ప్రభుత్వానికి మంచి లాభాలు రావడంతో పాటు వేలాది మందికి ఉపాధి కలుగుతుంది. రామగిరి గనుల్లో బంగారంతో పాటూ వెండి, ప్లాటినం ఖనిజాలు కూడా ఉన్నాయని, వాటిని వెలికితీస్తే ప్రభుత్వానికి మంచి ఆదాయం వస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

హంద్రీనీవాతో...

ఒకప్పుడు రాప్తాడు నియోజకవర్గం కరువుకు నిలయంగా ఉండేది. కనుచూపు మేర బీడు భూములే కనిపించేవి. అటువంటి తరుణంలో హంద్రీనీవా ప్రధాన కాలువ నియోజకవర్గంలో వెళ్లడంతో చాలా వరకూ సాగునీటి సమస్య తీరింది. 2014 నుంచి 2019 వరకూ మంత్రిగా పనిచేసిన పరిటాల సునీత రాప్తాడు నియోజకవర్గంలో హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు పూర్తయ్యేలా కృషి చేశారు. చెరువులకు నీరందించడంతో బోర్లలో భూగర్భ జలాలు పెరిగాయి.

గాలిమరలతో ఉపాధి..

నియోజకవర్గంలోని రామగిరి, ఆత్మకూరు మండలాల్లో పలు ప్రైవేటు కంపెనీలు దాదాపు 100 గాలి మరలు ఏర్పాటు చేశాయి. వీటితోదాదాపు 200 మందికి పైగా ఉపాధి లభించింది. ఇవి కేవలం గాలి కాలంలో మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేస్తాయి. గాలి మర సామర్థ్యం బట్టి రోజుకు 2 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని కంపెనీ నిర్వాహకులు తెలిపారు.

అంకితభావంతో.. నిబద్ధతతో పనిచేయండి



మాట్లాడుతున్న కేంద్ర ఎన్నికల పరిశీలకుడు మనీష్‌సింగ్

ఎన్నికలలో మైక్రో అబ్జర్వర్లు కీలకం

కేంద్ర ఎన్నికల పరిశీలకుడు మనీష్‌సింగ్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 28: ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమని కేంద్ర ఎన్నికల పరిశీలకుడు మనీష్‌సింగ్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూలోని ఆడిటోరియంలో ఆదివారం రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన అబ్జర్వర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత ఆయా నియోజకవర్గాల్లో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయి.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు.. తదితర వివరాలను పరిశీలకులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మనీష్‌సింగ్ మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల కమిషన్ సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో కేటాయించిన విధులను బాధ్యతగా, నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. నివేదికలను త్వరగా అందజేయాలని తెలిపారు. మాక్ పోల్‌ను పర్యవేక్షించాలన్నారు. మరో పరిశీలకుడు అజయ్‌నాథ్ మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ చాలా ముఖ్యమన్నారు. పోలింగ్ స్టేషన్లలో తమ పాత్ర ఏమిటో స్పష్టంగా తెలుసుకుని ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ పోలింగ్ రోజు సాధారణ పరిశీలకులు అన్నిచోట్లా ఉండలేరు కాబట్టి మైక్రో అబ్జర్వర్లను ఎన్నికల కమిషన్ నియమించిందన్నారు. జిల్లాలో 1031 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అక్కడ జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఏమైన సమస్యలు ఉంటే సెక్టోరియల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూదందాల ఎమ్మెల్యేని ఓడిద్దాం: మాజీ మంత్రి పల్లె

నల్లమాడ, ఏప్రిల్ 28: భూ దందాలు చేసి పబ్బం గడుపుకుంటున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని ఓడిద్దామని మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పాతబత్తలపల్లి పంచాయతీ పాత బత్తలపల్లి, చంద్రాయునిపల్లి, నల్లగొండ, యనుములవారిపల్లి గ్రామాల్లో శనివారం ఆయన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరా రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. వారికి గ్రామాల్లో ప్రజలు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. తర్వాత ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. పల్లె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నిత్యం భూదందాలకు పాల్పడుతూ పబ్బం గడుపుతున్నారన్నారు. ఆయన ఏనాడూ ప్రజల బాగోగులు పట్టించుకోలేదన్నారు. ఇలాంటి వ్యక్తి మనకు అవసరమా అన్ని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, నాయకులు గడ్డం రమణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బుట్టి నాగభూషణనాయుడు, కులశేఖర్‌నాయుడు, ప్రసాద్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు

పాతబత్తలపల్లి పంచాయతీలోని పలు గ్రామాలకు చెందిన 33 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారు పాత బత్తలపల్లిలో మాజీ మంత్రిపల్లె రఘునాథ రెడ్డి సమక్షంలో పార్టీలోకి చేరారు. పల్లె కండువాలు వేసి ఆహ్వానించారు. చేరినవారిలో బడా రాజారెడ్డి, బాలే శ్రీనివాసరెడ్డి, మాధవరెడ్డి, తోలేటి రామచంద్రారెడ్డి, వేమారెడ్డి, మద్దిలేటి సుదర్శన్‌రెడ్డి, గంగరాజు, నరసింహులు, ప్రభాకర్, ఆదినారాయణరెడ్డి. నరసింహులు, మేకల రామచంద్ర, మెకానిక్ ఆది, చాకలి నరసింహులు, రామాంజి తదితరులు ఉన్నారు. అలాగే శీకివారిపల్లికి చెందిన నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, జ్యోతి ప్రసాద్, లక్ష్మీనారాయణ చెరువు వాండ్లపల్లికి చెందిన రామాంజి, బొగ్గలపల్లి వినోద్, బాలక్రిష్ణ, మల్లేష్, రమణా తదితరులు కూడా పార్టీలోకి చేరారు.

గసికవారిపల్లి పంచాయతీలో ప్రచారం

బుక్కపట్నం: మండలంలోని గసికవారిపల్లి పంచాయతీలో మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గసికవారిపల్లిలో తొలుత ఆయన ఎడ్లబండిపై రోడ్డుషో చేసి శ్రేణులను ఉత్సాహపరిచారు. తర్వాత ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.



గసికవారిపల్లిలో ఎడ్లబండిపై ప్రచారం చేస్తున్న పల్లె

పల్లె వెంకటకృష్ణకిషోర్‌రెడ్డి ప్రచారం

ఓబుళదేవరచెరువు: మండలంలోని చింతమాను పంచాయతీ కమ్మవారిపల్లి, నాయనవారిపల్లి, అచ్చామియా పల్లి, బొమ్మిరెడ్డిచెరువు గ్రామాల్లో టీడీపీ యువ నాయకుడు పల్లె వెంకటక్రిష్ణకిషోర్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధి గెలిపించాలని కోరారు. కన్వీనర్ జయచంద్ర, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మరిన్ని పరిశ్రమలు తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తాం : బీకే



ముఖాముఖిలో మాట్లాడుతున్న బీకే పార్థసారధి

ధర్మవరం, ఏప్రిల్ 28: పట్టణంలోని సీఎన్‌బీ ఫంక్షన్ హాల్లో ఆదివారం బెంగళూర్‌కు చెందిన తెలుగు ప్రొఫెషన్‌వింగ్ సభ్యులు హిందూపురం పార్లమెంట్ టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధితో ముఖాముఖి నిర్వహించారు. ఇందులో బీకే పార్థసారధి మాట్లాడుతూ... కరువుకు నిలయమైన ఉమ్మడి అనంత జిల్లాకు మరిన్ని పరిశ్రమలు తీసుకురావడంతో పాటు వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక పట్టుపట్టి జిల్లాకు కియ కార్ల పరిశ్రమను తీసుకొచ్చారన్నారు. వీటి వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 50వేల మంది దాకా ఉపాధి పొందుతున్నట్లు చెప్పారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ దోపిడీ, బెదిరింపుల వల్ల కొన్ని అనుబంధ సంస్థలు వెళ్లిపోయాయన్నారు. అంతేకాకుండా రావాల్సిన కొన్ని సంస్థలు కూడా వెనక్కి వెళ్లిపోయాయని చెప్పారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి వల్ల వచ్చిన జాకీ పరిశ్రమ పోయిందన్నారు. దీని వల్ల దాదాపు 6వేల మందికి ఉపాధి దూరమైందన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువతకు ఉపాధి అవకాశాలపై అత్యంత శ్రద్ధను కనబరుస్తున్నారని, కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి రాగానే సత్యకుమార్‌తో కలిసి లోకేశ్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి మరిన్ని పరిశ్రమలు తీసుకురావడానికి కృషి చేస్తామని చెప్పారు. చిక్‌బళ్లాపూర్ నుంచి గోరంట్ల మీదుగా పుట్టపర్తికి రైల్వే లేన్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఇక సత్యసాయిజిల్లా వ్యాప్తంగా తాగునీటి ఎద్దడి ఎక్కడ ఉందో గుర్తించి పరిష్కరిస్తామన్నారు. పరిశ్రమలు, అనుబంధ పరిశ్రమలకు కావాల్సినంత భూములు సత్యసాయి జిల్లాలో ఉన్నాయన్నారు. వాటిల్లో పరిశ్రమలు ఏర్పాటుచేస్తే అందరికీ ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. వ్యవసాయరంగంలో వినూత్న మార్పులు తీసుకురావడంతో పాటు ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని బీకే తెలిపారు.

గ్రామాల్లో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తా

- ఎన్నికల ప్రచారంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్



వార్డుల్లో ప్రచారం చేస్తున్న సత్యకుమార్ యాదవ్

ధర్మవరంరూరల్, ఏప్రిల్28: తాను అధికారంలోకి రాగానే వార్డులు, గ్రామాల్లోని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ హామీ ఇచ్చారు. పట్టణంలోని గిర్రాజుకాలనీ, సత్యసాయినగర్, దుర్గానగర్, 33, 34, 35 వార్డులు, మారుతీనగర్, రాజేంద్రనగర్, లక్ష్మీనగర్‌లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి కమలం గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, సైకిల్ గుర్తుకు ఓటేసి బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని కోరారు. తాను ఎమ్మెల్యే కాగానే గ్రామాల్లో, వార్డుల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తారని వివరించారు. కూటమి విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సత్యకుమార్ సతీమణి ప్రచారం



24వ వార్డులో ప్రచారం చేస్తున్న త్రివేణి

ధర్మవరం: కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ సతీమణి త్రివేణి పట్టణంలోని 24వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి కమలం గుర్తుకు ఓటు వేసి సత్యకుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలన్నా రు. అలాగే ఎంపీగా బీకే పార్థసారధిని సైకిల్‌గుర్తుకు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారం చేపడితే ప్రజలకు ఎంతో మేలు చేస్తారని చెప్పారు. చేనేత పరిశ్రమకు పూర్వవైభవం రావాలంటే కమలం గుర్తుకు ఓటువేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలోకి పలువురి చేరిక

ముదిగుబ్బ: మండలంలో వైసీపీకి ప్రతిరోజూ ఎదురుదెబ్బ తగులుతోంది. మండల వ్యాప్తంగా ఇందుకూరు, దొరిగల్లు క్వార్టర్స్, మలకవేముల, నాగారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన వైసీపీ, ఇతర పార్టీల నుంచి సుమారు 40 కుటుంబాల వారు ఆదివారం బీజేపీలోకి చేరారు. వారు ధర్మవరంలో కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌ను కలిసి ఆయన సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సత్యకుమార్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఉచిత కంటివైద్య శిబిరం

ధర్మవరం, ఏప్రిల్ 28: పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది. కార్యక్రమానికి వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లయన్స్ క్లబ్ నిర్వాహకులు ప్రతినెలా పేదల కోసం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం శిబిరంలో 70 మందికి కంటి డాక్టర్ నాగేంద్ర పరీక్షలు నిర్వహించి 32 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు వెంకటస్వామి, అధ్యక్షకార్యదర్శులు గూడూరు మోహన్‌దాసు, రాజగోపాల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం

నల్లమాడ, ఏప్రిల్ 28: మండలంలోని వంకరకుంట, సానేవారిపల్లి గ్రామాల్లో ఆదివారం త్రైతసిద్ధాంత ప్రబోధ హిందూ జ్ఞానవేదిక ఉట్లవారిపల్లి కమిటీ సభ్యులు భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఆ దినారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీతోనే గిరిజనుల సంక్షేమం

నల్లమాడ, ఏప్రిల్ 28: టీడీపీతోనే గిరిజనుల సంక్షేమం సాధ్యమని గిరిజన విద్యార్థి హక్కుల పోరాట సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు డి. రాంప్రసాద్‌నాయక్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం గిరిజనుల ఓటు బ్యాంక్‌తో గెలిచి, గిరిజనులకు సంబంధించిన 25 పథకాలు తీసివేసిందన్నారు. వైసీపీ పాలనలో గిరిజనులకు అధికారంలో అన్యాయం జరిగిందన్నారు. గిరిజనులు ఒక తాటిపైకి వచ్చిఈ ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలిపించాలని ఆయన పిలునిచ్చారు.

కొల్హాపురమ్మకు ప్రత్యేక పూజలు



అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మి

రొళ్ల, ఏప్రిల్ 28: మండలంలోని రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీ దేవత బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సమీప కర్ణాటక ప్రాంతం నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

చంద్రబాబుతోనే ప్రజాసంక్షేమం: కందికుంట



కోర్తికోటలో కందికుంటకు గజమాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

తనకల్లు, ఏప్రిల్ 28: చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని, ఆయన సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు.

మండలంలోని కోర్తికోట పంచాయతీలో గల గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. తొలుత తిరు మయ్యగారిపల్లిలో ప్రచారం నిర్వహించారు. అక్కడ గ్రామ స్థులు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. మ హిళలు హారతులు పట్టారు. తర్వాత ఆయన ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలి ప్రజల్ని కోరారు. చంద్రబాబు సీఎం అయిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారన్నారు. ఆ పథకాల వల్ల కుటుంబంలోని అందరికీ లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి కావాలంటే చంద్రబాబు సీఎం కావాలని చెప్పారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, మళ్లీ రాష్ట్రం గాడిన పడాలంటే చంద్రబాబు రావాలని పేర్కొన్నారు. తాను గెలిస్తే నియోజవర్గంలోని అన్ని సమస్యల్ని పరిష్కరిస్తానన్నారు. తర్వాత కొండవెనుకపల్లి, మించలవారికోట, తుమ్మలవాండ్లపల్లి, తోడేళ్లగడ్డపల్లి, మంగదిన్నె పల్లి, కోర్తికోట, గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. అదేవిధంగా కొక్కంటి, డి. చెక్కవారిపల్లి గ్రామాల్లోనూ కందికుంట ప్రచారం కొనసాగించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్‌కే. మస్తావలి, రెడ్డిశేఖర్ రెడ్డి, హనుమంతరెడ్డి, మంజు నాథ్, వైవీ దినకర్ ప్రసాద్‌నాయుడు, ఈశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి, శంకర్ నాయుడు, బాగేపల్లి చలపతి, బీసీ నాగభూషణం, తోటసరోజమ్మ, చిన్నప్ప, మహబూబ్ బాషా, దస్తగిరి, ఉత్తన్ననాయక్, మాజీ సర్పంచ్‌లు ఈశ్వర్‌రెడ్డి, నాగమల్లు, జనసేన నాయకులు కుమార్, రమణ, సత్యవతి, బీజేపీ నాయకులు బాలాజీ తదితరులు పాల్గొన్నారు

జగన్ విధ్వంసక పాలనపై చార్జిషీటు..

కదిరి: రాష్ట్రంలో ఐదేళ్లపాటు కొనసాగిన సీఎం జగన్ విధ్వంసక పాలనపై ఎన్‌డీఏ కూటమి చార్జిషీటు వేస్తోందని ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ అధికారంలోకి రాగానే ప్రజావేదిక కూల్చివేతతో తన విధ్వంసక పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. తరువాత ప్రతిపక్షపార్టీల కార్యాలయాలపై దాడులు, నాయకులను వేధించడం, తప్పుడు కేసులు పెట్టడం లాంటివి కొనసాగించారన్నారు. వాటిపై చార్జిషీటు వేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే మద్యపాన నిషేధం అమలు చేస్తామని మాటా తప్పినందుకు, నిరుద్యోగులకు ప్రతి ఏడాది జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని మాట తప్పినందుకు, సీపీఎస్ రద్దు చేస్తామని ఉద్యోగులను మోసం చేసినందుకు, విద్యుత్, బస్సు చార్జీలు, మున్సిపాలిటీలో ఆస్తి పన్నులు పెంచినందుకు చార్జిషీటు వేస్తున్నామన్నారు. దళితులపై దాష్టికాలు కొనసాగించినందుకు, యువతను గంజాయి మత్తులో జోగేలా చేసినందుకు, మహిళలకు రక్షణ కల్పించలేనందుకు, గిట్టుబాటు ధరలు లేక నష్టాల పాలై రైతులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలపై చార్జిషీటు వేస్తున్నామన్నారు. దీనికి సీఎం జగన్ సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో నాయకులు డైమండ్ ఇర్ఫాన్, మేడా శంకర్, జనసేన చలపతి తదితరులు పాల్గొన్నారు.



చార్జిషీట్ కాపీలను చూపిస్తున్న కందికుంట

సూపర్ సిక్స్ పథకాలతో అన్నివర్గాలకు మేలు

- గ్రామాల్లో టీడీపీ శ్రేణుల విస్తృత ప్రచారం



కొత్తచెరువులో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి శ్రేణులు

ధర్మవరంరూరల్, ఏప్రిల్28: చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, మాజీ ఎంపీపీ కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిగిచెర్ల గ్రామంలో ఆదివారం వారు నాయకులు, కార్యకర్తలతో కలిసి పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల వల్ల కుటుంబంలో ఎవరెవరికి ఎంతమేరకు లబ్ధి చేకూరుతుందో వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే వెంటనే ఈ పథకాలను అమలు చేస్తారని తెలిపారు. కనుక ప్రజలు కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలఇన్‌చార్జి అశోక్ రెడ్డి, నాయకులు రాఘవరెడ్డి, పార్థారెడ్డి, గణేష్‌రెడ్డి, విజయ్‌చౌదరి, పాళ్యం వెంకటేష్, చంద్రాయుడు, ఆనంద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలంలోని వెంకటాపురం, బోగానిపల్లి గ్రామాల్లో టీడీపీ శ్రేణులు ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్‌పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చంద్రబాబు సీఎం అవగానే వీటిని అమలు చేస్తారన్నారు. ఎమ్మెల్యేగా పల్లె సింధూరారెడ్డిని, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డిపల్లి శంకర్‌రెడ్డి,ఎంపీటీసీ శ్రీనివాసులు, క్లస్టర్ ఇన్‌చార్జి నారప్పరెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రామాంజి, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: మండలంలోని నిడిగల్లు గ్రామంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్లభూషణ్, బీజేపీ నాయకుడు రాజేశ్ తదితరులు సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎంపీగా బీకే పార్థసారధిని, ఎమ్మెల్యేగా సత్యకుమార్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. నాయకులు చంద్రశేఖర్‌తోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తచెరువు: మండల కేంద్రంలోని బసవన్నకట్టవీధి, ముస్లిం వీధులలో కూటమి శ్రేణులు సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ప్రజలకు వాటి ఉపయోగాల గురించి వివరించారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.

కదిరిఅర్బన్: మండలంలోని ముత్యాలచెరువులో కూటమి శ్రేణులు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారని చెప్పారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుయువత మండల అధ్యక్షుడు హరి, నాయకులు సురేష్‌రెడ్డి, రాజశేఖర్, యుగంధర, బాలాజీనాయక్, ఉపేంద్ర, గంగిశెట్టి,నారాయణమ్మ, నరేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తాటిముంజలకు భలే గిరాకీ..

- వేసవి తాపం నుంచి ఊరట చెందడానికి వాటిపై ఆసక్తి చూపుతున్న ప్రజలు
- భారీగా కొనుగోలు
- పెరిగిన డిమాండ్



కాలేజ్‌సర్కిల్‌లో తాటిముంజలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 28: ప్రస్తుతం ఎండలు విపరీతంగా మండుతున్నాయి. ఎండవేడిమికి జనం విలవిల్లాడుతున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు పలు దారులు వెతుక్కుంటున్నారు. ఈ క్రమంలో తాటి ముంజలకు భలే డిమాండ్ ఏర్పడింది. ఎండలకు తాటి ముంజలు తింటే చలవ చేస్తుందని ప్రజలు వాటి కొనుగోలుకు ఎగబడుతున్నారు. దీంతో వాటికి డిమాండ్ పెరిగింది. తినడానికి రుచిగా ఉండడంతో పాటు వాటి వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు కూడా లభిస్తుండటంతో వాటి కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. పట్టణంలోని కాలేజ్‌సర్కిల్, కొత్తపేట, కదిరిగేటు సమీపంలో గ్రామీణప్రాంతాల వాసులు తాటిముంజలు తీసుకొచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. డజన్ రూ.60లు చొప్పున ధర చెబుతున్నారు. మధ్యాహ్నం కల్లా తెచ్చిన తాటిముంజలన్నీ అయిపోతున్నాయని, ఒక్కొక్కరం సుమారు రోజుకు వంద డజన్‌లకు పైగా అమ్ముతున్నామని అమ్మకం దారులు పేర్కొంటున్నారు.

టీడీపీలోకి వలసల జోరు



ధర్మవరంలో పరిటాల శ్రీరామ్ సమక్షంలో టీడీపీలోకి చేరుతున్న వైసీపీ నాయకులు

ధర్మవరం, ఏప్రిల్ 28: తెలుగుదేశం పార్టీలోకి వైసీపీ నాయకుల వలసల జోరు కొనసాగుతోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన సమక్షంలో 37వ వార్డు టీచర్స్ కాలనీకి చెందిన వైసీపీ నాయకుడు కొత్తపేట రవితో పాటు దాదాపు 60 కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. వీరందరికి పరిటాల శ్రీరామ్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం శ్రీరామ్ మాట్లాడుతూ... టీడీపీలోకి వైసీపీ నుంచి వలసలు భారీగా కొనసాగుతున్నాయన్నారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్‌ను అందరం కలిసి కట్టుగా పని చేసి గెలుపించుకుందామని పిలుపునిచ్చారు.



టీడీపీలోకి చేరిన ఉప్పునేసినపల్లి వాసులతో శ్రీరామ్

ధర్మవరంరూరల్ మండలంలో ఉప్పునేసినపల్లి గ్రామానికి చెందిన దాదాపు 10 కుటుంబాల వారు వైసీపీకి గుడ్‌బై చెప్పి తెలుగు దేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వెంకటాపురంలోని పరిటాల శ్రీరామ్ స్వగృహంలో వారు ఆయన సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి శ్రీరామ్ కండువాలు వేపి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో విశ్వనాథ్, అమర్నాథ్, ఆదినారాయణ, తిక్కయ్య, దాసరి ముత్యాలు, దాసరి నాగేంద్ర, దేవరకొండ తిక్కయ్య, సాకే సాయినాథ్, కదిరప్ప, రామాంజనేయులు, క్రాంతివీరతో పాటు మరికొందరు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, సర్పంచ్ ముత్యాలప్పనాయుడు, విజయసారథి, పాళ్యంవెంకటేష్, దిగ్గెంరవి, కాటమయ్య, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

కోట్ల ఆస్తులను పేదలకు పంచిన కుటుంబం మాది

- తమకు ఏదో సాయం చేశానని కేతిరెడ్డి చెప్పుకోవడం హాస్యాస్పదం
- బీజేపీ నాయకుల ఆగ్రహం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ధర్మవరం, ఏప్రిల్ 28: కోట్లాది రుపాయల ఆస్తులను పేదలకు పంచిన కుటుంబం మాది, అలాంటిది తమకు ఏదో సాయం చేశానని ఎమ్మెల్యే కేతిరెడ్డి పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ నాయకులు కోటిసూర్యప్రకాశ్ బాబు, ఆదినారాయణయాదవ్‌లు విరుచుకుపడ్డారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోటిసూర్యప్రకాశ్‌బాబు మాట్లాడుతూ.. తన పిల్లలకు మెడికల్ సీటు ఇప్పించానని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం జగన్ వద్దకు వెళ్లి మెడికల్ సీటు అడిగానే కానీ.. ఎప్పుడూ మీ వద్దకు వచ్చింది లేదన్నారు. రూ.4కోట్లు విలువైన భూమిని జగనన్న కాలనీకి విరాళంగా ఇచ్చింది మా కుటుంబమేనన్నారు. అలాంటిది మేము ఏదో ఆశించామని నిందలు వేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యేగా బీసీలకు మీరు ఏమి చేశారని వారు కేతిరెడ్డిని ప్రశ్నించారు. బీసీలు మీ కోసం ఆస్తితో పాటు డబ్బులు కూడా పోగొట్టుకున్నారని అన్నారు. ఆదినారాయణ యాదవ్ మాట్లాడుతూ... మా తాతల కాలం నుంచి మా కుటుంబం రాజకీయాల్లో ఉందని, తాను మండల కన్వీనర్‌గా ఉన్నప్పుడు మా మండల వాసులకు మీకు పరిచయం చేసిన విషయాన్ని మరచిపోరాదని అన్నారు. నేను ఎంపీపీగా ఉన్నది సంతకాలు పెట్టడానికే కానీ తప్ప ఇక ఎందుకూ ఉపయోగపడ లేదన్నారు. అంతేకాకుండా రూ.40లక్షల బిల్లులు పెండింగ్‌లో పెట్టితనను వేధింపులకుగురిచేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వాల్మీకిసంఘం నాయకులు గొట్లురు చంద్ర పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



విద్యార్థినికి నగదు బహుమతి అందిస్తున్న దృశ్యం

ధర్మవరం,ఏప్రిల్ 28: క్రమశిక్షణతో కూడినవిద్య చాలా అవసరమని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థిని నిత్యశ్రీ ఇటీవల వెలువడిన పది పరీక్ష ఫలితాల్లో 594 మార్కులు సాధించి ధర్మవరం పట్టణంలో మొదటి స్థానంలో నిలిచింది. ఇందుకు గాను పాఠశాలలో ఆదివారం ఆమెకు అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లా ఆర్థోపెడిక్ డాక్టర్‌శ్రీకాంత్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్, జేవీవీ జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ ఆదిశేష పాల్గొన్నారు. ఈ సందర్భంగా నక్క వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి పది ఫలితాలలో కాకతీయవిద్యార్థులు ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన నిత్యశ్రీకి రూ.10వేలు, 592 మార్కులు సాధించిన అనూషకు రూ.8వేల నగదు బహుమతులు, మెమొంటోలను అందజేశారు. పాఠశాల ఫౌండర్ రామిరెడ్డి, కరెస్పాండెంట్ నిర్మలా జయచంద్రారెడి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 28: మండలంలోని హంద్రీనీవా కాలువలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఓ యువకుడు హంద్రీనీవా కాలువలోకి చేపలు పట్టడానికి వెళ్లగా... ఓ వ్యక్తి మృతదేహం కనిపించడంతో అతను పోలీసులకు సమాచారం అందించాడు. ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, రామగిరి సీఐ శివాంజనేయులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చనిపోయిన వ్యక్తి వయస్సు 45-55 మధ్య ఉంటుందని, అతను చనిపోయి 15 రోజులై ఉంటుందని, శవం కుళ్లిపోయి దుర్వాసన వస్తోందని, గుర్తుపట్టడానికి వీలులేకుండా ఉందని తెలిపారు. వ్యక్తి మృతి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించామని, ఆచూకీ తెలిస్తే 94407 96836ను సంప్రదించాలని సూచించారు.

కొల్హాపురమ్మకు ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మి

రొళ్ల, ఏప్రిల్ 28: మండలంలోని రత్నగిరిలో వెలిసిన కొల్హాపురి మహాలక్ష్మీ దేవత బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సమీప కర్ణాటక ప్రాంతం నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కాళికాంబకమటేశ్వరస్వామికి...

రత్నగిరిలో వెలిసిన కాళికాంబ కమటేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో అలంకరించి పూజలు, అర్చనలు జరిపించారు. స్వామిని దర్శించుకోనేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పూజలు, అర్చనలు నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో కాళికాంబకమటేశ్వరస్వామి

మూర్ఛ వ్యాధి శిబిరానికి స్పందన

పెనుకొండ, ఏప్రిల్ 28: జేవీవీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఘనగిరి పాఠశాలలో నిర్వహించిన ఉచిత మూర్ఛ వ్యాధి శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరాన్ని పరిటాల శ్రీరాములు డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయప్ప ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన అక్షయ న్యూరో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నీలైఖ్య రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో 25మందికి వైద్య చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి హరీ, జోన్ అధ్యక్షులు నబి, ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్, సభ్యులు రామన్న, రవి, యశ్వంత్ పాల్గొన్నారు.

గుండెపోటుతో లారీడ్రైవర్ మృతి

గుత్తిరూరల్, ఏప్రిల్ 28: మండలంలోని కొత్తపేట గ్రామశివారులోని 67వ జాతీయ రహదారిపై గుండెపోటుతో లారీ డ్రైవర్ మహమద్ రఫీ (54) ఆదివారం మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు కర్ణాటక రాష్ట్రం బళ్ళారికి చెందిన మహమద్ రఫీ ఐచర్ వాహనంలో లోడు తీసుకొని తాడిపత్రికి మూడు రోజుల క్రితం వచ్చాడు. కుటుంబ సభ్యులు మహమద్ రఫీకి శనివారం నుంచి ఫోన్ చేసినా సమాధానం రాకపోవడంతో ఐచర్‌కు ఉన్న జీపీఎస్ ద్వారా చూసి కొత్తపేట వద్ద ఉన్నట్లు చూపించింది. అక్కడికి వచ్చి చూడగా లారీలో పడుకొని అలాగే చనిపోయాడని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మహమద్ రఫీ గుండెపోటుతో మృతి చెందినట్లు వారు తెలిపారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బేకరీలో గ్యాస్ లీక్

కళ్యాణదుర్గంరూరల్ ఏప్రిల్ 28: పట్టణంలోని కొల్లాపురమ్మ గుడి వద్ద బేకరీలో ఆదివారం గ్యాస్ సిలిండర్ లీకైంది. స్థానికులు తెలిపిన మేరకు కొల్లాపురమ్మ గుడి ఎదుట బేకరీ ఉంది. నిర్వాహకులు దుకాణం బంద్ చేశారు. షాపులో వున్న గ్యాస్ లీకేజీ అవడంతో ఆ వాసనను గమనించిన చుట్టుపక్కల వారు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది గ్యాస్ స్టవ్, సిలిండర్‌ను బయటకు తీశారు. ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


లీక్ అయిన సిలిండర్‌ను బయటకు తీసిన ఫైర్ సిబ్బంది

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 28: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ దాదాపీర్ తెలిపారు. మండలంలోని నాగలూరుకు చెందిన వడ్డి వెంకటరమణ(58) మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెందాడు. మనస్థాపానికి గురై ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఈనెల 24న ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన భార్య, కుమార్తె హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ దాదాపీర్ తెలిపారు. మృతుడి అల్లుడు కమల్నాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

నోటికాడి భోజనం లాగేసిన వైసీపీ

- ఇది నందమూరి పురం
- ఎన్నికల ప్రచారంలో నందమూరి వసుంధరాదేవి


ప్రచారంలో ప్రసంగిస్తున్న వసుంధరాదేవి


బొట్టుపెట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు

హిందూపురం, ఏప్రిల్ 28: వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటిన్‌ను మూసేసి, పేదల నోటికాడ భోజనం లాగేసుకున్నారని నందమూరి బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధరాదేవి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ఆదివారం స్థానిక కొల్లకుంట ఆంజనేయస్వామి ఆలయంలో పూజల అనంతరం ఒకటి నుంచి ఆరో వార్డు వరకు పర్యటించారు. ఈ సందర్భంగా కొల్లకుంటలో ఆమె మాట్లాడుతూ.. వైసీపీ ఐదేళ్లకాలంలో అన్నింటినీ రద్దుచేసింది తప్ప ప్రజలకు మేలు చేసే ఏ ఒక్క పథకం తీసుకురాలేదన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకోసం బాలకృష్ణ హిందూపురం నుంచి మూడోసారి గెలవనున్నారని అన్నారు. నియోజకవర్గానికి ఎన్టీఆర్ చేయాలనుకున్న పనులన్నీ బాలకృష్ణ పూర్తిచేస్తారన్నారు. టీడీపీ అధికారంలో లేకపోయినా కొవిడ్ సమయంలో సొంత నిధులతో పురం ఆసుపత్రికి పరికరాలు, మందులు అందించామన్నారు. హిందూపురమంటే నందమూరి పురమని, ఈ నియోజకవర్గంలోని ప్రజలంతా తమ కుటుంబ సభ్యులన్నారు. బాలకృష్ణ ఎక్కడున్నా హిందూపురం అభివృద్ధి పైనే ధ్యాస అన్నారు. టీడీపీ హయాంలో హిందూపురం ఆసుపత్రి ఎంతో మెరుగ్గా ఉండేదని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ఈ ప్రభుత్వంలో అభివృద్ధి ఎక్కడా జరగలేదని, హిందూపురం నుంచి బాలకృష్ణ గెలిచి, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందన్నారు. బాలకృష్ణ హ్యాట్రిక్ సాధిస్తారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు బాగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆరోగ్యంపై బాలకృష్ణకు చాలా శ్రద్ధ ఎక్కువన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజనప్ప, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ రావిళ్లలక్ష్మి, లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, పట్టణాధ్యక్షుడు రమేష్, మునిసిపల్ మాజీ చైర్మన్ అనిల్‌కుమార్, ప్రెస్ వెంకటేశ్, నెట్టప్ప, తిరుపతయ్య, చంద్రమోహన్, నాగభూషణ పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం


టీడీపీలో చేరుతున్నఎర్రబల్లి వలంటీర్ శివ

గోరంట్ల, ఏప్రిల్ 28: టీడీపీ విజయం కోసం గోరంట్ల మండలంలోని నారసింహపల్లి పంచాయతీ గ్రామాల్లో టీడీపీ నాయకులు ఆదివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికెళ్లి కరపత్రాలు పంచుతూ టీడీపీ అధికారంలోకి వస్తే అమలుచేసే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎర్రబల్లి గ్రామ వలంటీర్ శివ టీడీపీలో చేరారు. వైసీపీ విధానాలు నచ్చక టీడీపీలో చేరినట్లు తెలిపారు. అభ్యర్థి సవిత సోదరుడు రవీంద్ర కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సోముశేఖర్, రవీంద్ర, దేవా నరసింహప్ప, అశ్వత్థరెడ్డి, రాజారెడ్డి, నందమోహన్‌రెడ్డి, సుబ్బు, నరేష్, శ్రీధర్, సుబ్బారెడ్డి, కిషోర్‌రాయల్, నరసింహులు, వెంకటరంగారెడ్డి, వేణుగోపాల్, ఉత్తమరెడ్డి, బాలక్రిష్ణ, వెంకటరెడ్డి, నరేంద్ర, రాఘవనాయుడు తదితరులున్నారు.

రామరాజ్యం కావాలంటే టీడీపీ రావాలి

గుండుమల, ఎంఎస్ రాజు


ఊరేగింపుగా వస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి రాజు, గుండుమల

అగళి, ఏప్రిల్ 28: రామరాజ్యం రావాలంటే టీడీపీకి ఓటు వేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు పేర్కొన్నారు. అగళి మండలం పీ బ్యాడిగెర, హెచ్‌డీ హళ్లి, ఇరిగేపల్లి, ఆర్‌జీపల్లి, కోడిపల్లి, రామనపల్లి పంచాయతీ కేంద్రాల్లో ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గుండుమల మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో ప్రభుత్వం పోవాలి, రామరాజ్యం రావాలంటే సైకిల్ గుర్తుకు ఓటేయాలన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. నాయకులు, కార్యకర్తలు గజమాలతో సన్మానించారు. ఎంఎస్ రాజు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనతో గుండుమల ఆశీస్సులతో ఇక్కడ బరిలో దిగానని తెలిపారు. టీడీపీ నాయకులు డాక్టర్ శ్రీనివాసమూర్తి, జడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ కుమారస్వామి, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మడకశిరటౌన్: సోషల్ మీడియా వేదికగా వైసీపీ శ్రేణులు ఫేక్ ప్రచారాలను తిప్పి కొట్టాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు పిలుపునిచ్చారు. ఆయన శనివారం రాత్రి హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోషల్ మీడియా కోఆర్డినేటర్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. అలాగే గుండుమల తిప్పేస్వామి, ఎంఎస్ రాజు సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు.

నేడు గుడిబండలో టీడీపీ ప్రచారం

గుడిబండ, ఏప్రిల్ 28: మండలంలోని గుణేమోరుబాగల్, మోరుబాగల్, తాళికెర, ముద్దుకూరు, మందలపల్లి, సిసిగిరి, కొంకల్లు, ఎస్ రాయాపురం, పంచాయతీ గ్రామాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు సోమవారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరవుతారని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

సభలు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి: ఆర్‌ఓ

మడకశిర రూరల్, ఏప్రిల్ 28 : ఎన్నికలలో పోటీ చేస్తున్న రాజకీపార్టీల నాయకుల సభలకు, ర్యాలీలకు తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌరిశంకర్ రావు తెలిపారు. ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనుమతులు లేకుండా నిబంధనలు అతిక్రమించి ర్యాలీలు, సభలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభివృద్ధి సాధకుడు చంద్రబాబు: బీకే


గొందిపల్లి ప్రచారంలో మాట్లాడుతున్న బీకే

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 28 : అభివృద్ధిలో చంద్రబాబుకు, జగన్‌కు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందని టీడీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి విమర్శించారు. చంద్రబాబు అభివృద్ధి సాధకుడని, జగన్ నిరోధకుడన్నారు. ఆయన ఆదివారం మండలంలోని గొందిపల్లిలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవితతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. అనంతరం బీకే మాట్లాడుతూ... వెనుకబడిన రాయలసీమకు గొల్లపల్లి రిజర్వాయర్ ఏర్పాటుచేసి, కియ పరిశ్రమను తెచ్చి ఎంతో మందికి ఉపాధి చూపిన ఘనత చంద్రబాబుది అన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు జగన్ కియ వద్దకు వచ్చి తమ ప్రభుత్వం రాగానే రైతుల భూములు తిరిగి ఇప్పిస్తామన్నారన్నారు. అభివృద్ధికి వ్యతిరేకి జగన్‌కు ఎన్నికల్లో గట్టిగా బుద్ధిచెప్పాలన్నారు. టీడీపీ నాయకులు గుట్టూరు చిన్న వెంకటరాముడు, లక్ష్మీనారాయణరెడ్డి, రఘువీరాచౌదరి, సూర్య నారాయణరెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, కురుబ కృష్ణమూర్తి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పెనుకొండ: జగన్ అరాచక పాలనలో రాష్ట్రం అభివృద్ధి విషయంలో దేశంలోనే వెనుకబడిందని, రాష్ట్రం అభివృద్ధి బాటలో నడవాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడం ఒక్కటే మార్గమని హిందూపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజల కోసం అనేక పథకాలు ప్రవేశపెడితే.... వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సంక్షేమాన్ని మరిచి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు.

ఒక్క చాన్స్‌తో రాష్ట్రం అధోగతి

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత
- పలు గ్రామాల్లో భారీ జనసందోహం మధ్య ప్రచారం


చంద్రగిరి గ్రామంలో భారీగా తరలివచ్చిన జనం

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 28 : వైసీపీకి ఓటేసి ఒక్క చాన్స్ ఇవ్వడంతో రాష్ట్రం అధోగతి పట్టిందని, మళ్లీ వైసీపీకి ఓటేస్తే సర్వనాశనం అవుతుందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అన్నారు. టీడీపీ సంక్షేమం, అభివృద్ధి జరిగాయన్నారు. ఆమె ఆదివారం మండలంలోని గొందిపల్లి, దుద్దేబండ, చంద్రగిరి, గొల్లపల్లి, గోనిపేట, రాంపురం, గ్రామాల్లో భారీ జనసందోహం మధ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ గ్రామాల్లో గజమాలలు, పూలు, హారతులతో మహిళలు ఆమెను ఆశీర్వదించారు. ఆమె టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... ఐదేళ్ల జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రం ఇరవై ఏళ్ల వెనక్కు వెళ్లిందన్నారు. విదేశాల నుంచి పెట్టుబడిదారులు రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టాలన్నా జగన్ వైఖరితో భయబ్రాంతులకు గురవుతున్నారన్నారు. కియ పరిశ్రమ రాకతో వేల మంది ఉద్యోగాలు పొందుతున్నారని, గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణంతో ఈ ప్రాంతంలో తాగు, సాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉన్నాయన్నారు. ఇవి చంద్రబాబు చలువేనన్నారు. పరిశ్రమ రాకతో ఇక్కడి ప్రజల జీవన విధానం మారిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, పిల్లల భవిష్యత్తు బాగుండాలన్నా మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సిద్దయ్య, గుట్టూరు చిన్నవెంకట రాముడు, జిల్లా అధికార ప్రతినిధి రఘువీరా, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, సూర్యనారాయణరెడ్డి, పోతిరెడ్డి, బాబుల్‌రెడ్డి, బోయ రామక్రిష్ణ, గుట్టూరు సూరి, రాజు, విశ్వనాథ్, నరేంద్రరెడ్డి, హరీష్‌రెడ్డి, వెంకటేశ్‌రెడ్డి, రంగారెడ్డి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్ : మైనార్టీల రక్షణ, సంక్షేమం టీడీపీతోనే అని, జగన్ మైనార్టీలను మోసం చేశాడని ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అన్నారు. ఆమె ఆదివారం పట్టణ సమీపంలోని దర్గాపేట ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మైనార్టీ నాయకుడు దాదు, జప్రుల్లా ఖాన్, సనావుల్లా తదితరులు పాల్గొన్నారు.


మైనార్టీలతో మాట్లాడుతున్న సవిత

మైనార్టీలను మోసం చేసిన వైసీపీ

మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్

హిందూపురం/ చిలమత్తూరు, ఏప్రిల్ 28: నా మైనార్టీలు అంటూ వైసీపీ ప్రభుత్వం వారిని మోసం చేసిందని మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం చిలమత్తూరులో ఆయన పర్యటించి ముస్లిం మైనార్టీలను టీడీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. చిలమత్తూరులో టీడీపీ నాయకులు నాగరాజుయాదవ్, లక్ష్మీనారాయణయాదవ్, దేమకేతేపల్లి అంజినప్ప, రంగారెడ్డి, సోమశేఖర్, బయపరెడ్డి, బాలాజీ, చంద్ర మోహన్, మాజీ ఎంపీటీసీ సూర్యనారాయణ, టేకులోడు బయపరెడ్డి తదితరలు మైనార్టీ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఇక్బాల్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ముస్లింలకు తీరని అన్యాయం చేసిందన్నారు. కేవలం ముస్లిం మైనారిటీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప వారికి చేసిందేమీ లేదన్నారు. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు మొదటి నుంచి మైనార్టీలపై ప్రత్యేక దృష్టి పెడుతూ వచ్చారన్నారు. ఆయన వెంట పురం మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్ ఉన్నారు. అలాగే ఆయన లేపాక్షిలో ఏర్పాటు చేసిన ముస్లీం మైనార్టీల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

హిందూపురం అర్బన్: వైసీపీకి పురంలో మరో షాక్ తగిలింది. 12వ వార్డు వైసీపీ కౌన్సిలర్ రహమత్‌బి టీడీపీ కండువా కప్పుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ షేక్ మహ్మద్ ఇక్బాల్ ఆదివారం పట్టణ పరిధిలోని 12వ వార్డు మోడల్ కాలనీ 2లో రహమత్‌బీని ఆమె స్వగృహంలో ఇక్బాల్ కలిశారు. వైసీపీలో తనకు జరిగిన అన్యాయం, ముస్లింలకు వైసీపీ చేసిన మోసం వివరించారు. ఈ సందర్భంగా ఆమె టీడీపీలో చేరారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక ఆదివారం తన పుట్టిన రోజు వేడుకలను జరుపుకుంటున్న సమయంలో వైసీపీ కౌన్సిలర్ టీడీపీలోకి జంప్ కావడాన్ని వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నట్లు ఆ పార్టీలోని కొంద మాట్లాడుకోవడం విశేషం. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ అనిల్‌కుమార్, టీడీపీ మైనార్టీ సెల్ హిదాయత్ తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా టీడీపీ ప్రకటించిన పథకాలను తెలుసుకొని మరి కొంత మంది త్వరలో టీడీపీలో చేరనున్నట్లు సమాచారం.


కౌన్సిలర్ రహమత్‌బీకి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఇక్బాల్

గిరిప్రదక్షిణం.. సర్వపాపహరణం


గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 28: గిరిప్రదక్షిణతో సర్వపాపాలు నశిస్తాయని ఆలయ ప్రధాన అర్చకులు గోవిందశర్మ పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని ప్రసిద్ధ మహిమాన్విత గుడ్డం రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు వివిధ అభిషేకాలు అర్చనలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి గిరిప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా గోవిందనామ స్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 28: మండలంలోని హంద్రీనీవా కాలువలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఓ యువకుడు హంద్రీనీవా కాలువలోకి చేపలు పట్టడానికి వెళ్లగా... ఓ వ్యక్తి మృతదేహం కనిపించడంతో అతను పోలీసులకు సమాచారం అందించాడు. ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, రామగిరి సీఐ శివాంజనేయులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చనిపోయిన వ్యక్తి వయస్సు 45-55 మధ్య ఉంటుందని, అతను చనిపోయి 15 రోజులై ఉంటుందని, శవం కుళ్లిపోయి దుర్వాసన వస్తోందని, గుర్తుపట్టడానికి వీలులేకుండా ఉందన్నారు. వ్యక్తి మృతి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు నమోదు చేశామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించామని, ఎవరికైనా ఆచూకి తెలిస్తే 94407 96836, 94407 96835ను సంప్రదించాలని సూచించారు.


మడకశిరలో గోదాము నిర్మాణం ఇలా...


కోడిగేపల్లిలోని గోదాము దుస్థితి

అరటి తోటల దగ్ధం

బెళుగుప్ప, ఏప్రిల్ 28: మండలంలోని కోనాపురంలో ఆదివారం చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో రెండు అరటితోటలు దగ్ధమయ్యాయి. రూ.రెండు లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు భాస్కర్, జయరాములు తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిన ఈ ప్రమాదంలో భాస్కర్‌కు చెందిన ఆరు ఎకరాల అరటితోటలో రూ.లక్ష విలువ చేసే డ్రిప్ పైపులు, పరికరాలు, జయరాములకు చెందిన నాలుగు ఎకరాల తోటలోని డ్రిప్ వైర్లు కాలిపోయాయి.

గోడౌన్..

- నిధుల కొరతతో ఆగిపోయిన గోదాముల నిర్మాణం
- నెరవేరని సీఎం జగన్ హామీలు

మడకశిర రూరల్, ఏప్రిల్ 28:
రైతులు పండించే పంటలు స్థానికంగా నిల్వ ఉంచడానికి వైసీపీ ప్రభుత్వం చేపట్టిన గోదాముల నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. నిధులు కొరతతో గోదాముల నిర్మాణాలు వివిధ దశల్లో నిల్చిపోయాయి. రైతులు పండించిన పంటలు నిల్వ ఉంచడానికి మడకశిర మార్కెట్ యార్డు పరిధిలో స్థలాన్ని సేకరించారు. జమ్మానిపల్లి, మెళవాయి, మడకశిర, కదిరేల్లి, సీ కోడిగేపల్లి, బుళ్లసముద్రం, ఆమిదాలగొంది, గుడిబండ, మందలపల్లి, మోరుబాగులు, అలుకూర్, రొళ్ల, అమరాపురం గ్రామాల్లో 13 గోదాముల నిర్మాణాలకు 2022లో రూ.2.86 కోట్లు కేటాయించారు. ఒక్కొక్క గోదాము నిర్మాణం రూ.22 లక్షలతో చేపట్టారు. మొదటి దశలో నిధులు విడుదల కావడంతో గోదాముల నిర్మాణాలు పునాదులు వేసి, గోడలవరకు పనులు చేపట్టారు.

రెండో దశ పనులు ప్రాంభించడానికి నిధులు విడుదల కాకపోవడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. మూడేళ్లు గడిచినా పనులు పూర్తికాలేదు. దీంతో వైసీపీ ప్రభుత్వపై రైతులు అసహనం వ్యక్తంచేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వం రైతులకు చేసిందేమీలేదు



వైసీపీ ప్రభుత్వం రైతులకు చేసిన మేలు ఏమీ లేదు. మేము పండిన పంటలను స్థానికంగానే గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేస్తామన్నారు. అది కేవలం మాటలకై పరిమిత మైంది. గోదాముల నిర్మాణము కూడా ముందుకు సాగడం లేదు. సీఎం జగన్ రైతులకు ఇచ్చిన హామీలు ఏవీ నెరవేరలేదు. మాటలతో మభ్యపెడుతున్నారు.

- వెంకటరెడ్డి, రైతు, సీ కోడిగేపల్లి

త్వరలో పనులు ప్రారంభిస్తారు

మార్కెట్ యార్డు వారు కేవలం స్థల పరిశీల చేశారు. నిధులు, నిర్మాణపనులు ఏడీసీబ్యాంక్‌సొసైటీ వారి ఆధ్వర్యంలో చేపట్టారు. ఆగిపోయిన పనులు త్వరలో ప్రారంభిస్తారు.

- నాగేంద్ర, మార్కెట్ యార్డు కార్యదర్శి